Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 10.10.2014, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 19 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## మాటలతోనే...
# రాజధాని కోటలు



- కష్టతరంగా భూసేకరణ
- సహకరించని కృష్ణ, గుంటూరు రైతులు
- రాజధానిపై ముందుకు సాగని పరుగు

**రాష్ట్రంలో రాబోయే ఐదేళ్లలో ఏ పనీ ముందుకుసాగే పరిస్థితి కనిపించడం లేదు. ముఖ్యమంత్రితో సహ మంత్రులందరూ మాటలతో కోటలు కడుతున్నారు తప్పితే అభివృద్ధి పరంగా ఒక్క అడుగూ ముందుకు పడడం లేదు.**

విభజన తర్వాత రాష్ట్రానికి ఆస్తులు కంటే అప్పులు ఎక్కువుగా మిగిలాయి. అధిక ఆదాయమొచ్చే హైదరాబాద్‌ను కోల్పోయాం. హైదరాబాద్ ఆదాయంలో ఒక్క నయాపైసా మనకు రాదు. 15వేల కోట్ల లోటుతో ప్రయాణం మొదలుపెట్టాం. ఉద్యోగులకు ఒక ఏడాది జీతాలు కేంద్రమే చూసుకుంటానంది కాబట్టి సరిపోయింది. కళ్ళు మూసి తెరిచేసరికి ఏడాది అవుతుంది. ఆ తర్వాత జీతాలకు మనమే అగచాట్లు పడాలి. రాష్ట్ర ఆదాయం, ఆర్థిక పటిష్టత అంతంత మాత్రంగా ఉంటే చంద్రబాబు మాత్రం ఋణమాఫీ వంటి తలకుమించిన పనులు పెట్టుకున్నాడు. రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు పెంచే దిశగా చంద్రబాబు ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదు.

ముఖ్యంగా రాజధానిగా విజయవాడ ప్రాంతాన్ని ఎంపిక చేయడమే పెద్ద పొరపాటు. ఈ ప్రాంతాన్ని ఎంపిక చేయడం వల్ల రాష్ట్రంలో కొత్తగా జరగాల్సిన లావాదేవీలన్నీ స్థంభించిపోయాయి. సింగపూర్, కౌలాలంపూర్, రాయచూర్, చికాగో, ఇస్తాంబుల్ వంటి రాజధాని నగరాన్ని నిర్మించాలంటూ చంద్రబాబు కలలు కంటున్నాడు. ఇందు కోసం రాజధాని కమిటీ అంటూ ఒకదానిని వేసి ఈ దేశాలన్నింటికీ తిప్పుతున్నాడు. ఈ ప్రయత్నం శుద్ధ దండగ. విజయవాడ వంటి ఖరీదైన భూములున్న ప్రాంతంలో ఇలాంటి రాజధాని నగరాల నిర్మాణం

(మిగతా 10వ పేజీలో)





# ఆధిపత్యం దిశగా అడుగు

## పాఠాలు చెప్పే పంతులు పాలనవైపుగా సాగుతున్నాడు

**రాజకీయాలలో ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి నాయకులకు ప్రధానంగా రెండు మార్గాలుంటాయి. ఒకటి శత్రువుతో సైతం ప్రేమగా మాట్లాడి దగ్గర చేసుకోవడం, రెండోది ఆగ్రహావేశాలను ప్రదర్శిస్తూ నియంతవైఖరిని కనపరచడం. మన రాష్ట్రంలో చూస్తే ఇందుకు ఇద్దరు నాయకులను ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఒకరు దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి అయితే రెండో వారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.**

పార్టీపై తన పట్టును నిలుపుకోవడానికి చంద్రబాబు నియంత వైఖరి అవలంబిస్తుంటారు. కాని సీఎం కాక ముందు వై.యస్.లోనూ నియంతృత్వ వైఖరి కనిపించేది. సీఎం అయ్యాక మాత్రం రాజకీయ శత్రువులను, ప్రత్యర్థులను ఆయన తన స్నేహితులుగా మలచుకున్నాడు. ఇక్కడ తేడా ఏంటంటే అభిమానంతో వై.యస్.కు దగ్గరైనవాళ్ళు ఆయనకు అధికారం లేకపోయినా అదే అభిమానాన్ని చూపిస్తారు. కాని రేపు చంద్రబాబు సీఎం పదవి నుండి దిగిపోతే ఆయనకు భయపడి వంగివంగి దండాలు పెట్టినవాళ్లే, రేపు తోక చూపించి పోతారు.

ప్రస్తుతం మన జిల్లాలో చూస్తే చంద్రబాబుకు నమ్మిన బంటు, మంత్రి నారాయణ కూడా తన బాస్ మార్గంలోనే నడుస్తున్నట్లుగా ఉంది. జిల్లాలో పార్టీపై, పార్టీ కేడర్‌పై పట్టు కోసం చేసే ప్రయత్నాలలో తన బాస్ మార్గాన్ని ఎంచుకున్నాడు. మంత్రి కాబట్టి

(మిగతా 10వ పేజీలో)

# అమ్మకు బెయిల్ లేదు.. జైలే!

## భక్తులకు నిరాశ

**తమిళనాడులో ఏదైనా వేలం వెర్రిగానే ఉంటుంది. బిన్‌లాడెన్, దావూద్ఇబ్రహీం వంటి నేరగాళ్లు కూడా తమిళనాడు రాజకీయాలలో అడుగుపెట్టి ఆల్‌ఫ్రీ అని వాగ్దానం చేసారంటే అక్కడి ప్రజలు హారతులు పడతారు. వాళ్లు చేసిన నేరాలకు సంబంధించి ఏదన్నా శిక్ష పడితే దానిని నిరసిస్తూ ప్రభుత్వ ఆస్తులను తగలబెడతారు. మరీ అంత పిచ్చి వాళ్లకు.**

తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితకు స్వాతంత్రోద్యమం చేసిందనో, అన్నాహజారేలా అవినీతిపై పోరాటం చేసిందనో కర్ణాటక ప్రత్యేక కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష వేయలేదు. 66కోట్ల అక్రమాస్తులు పక్కాగా పట్టుబడ్డాయి. సాక్ష్యాలతో సహా ఈ అక్రమాస్తులు ఋజువయ్యాయి కాబట్టే ఆమెకు శిక్ష ఖరారైంది.

కర్ణాటక హైకోర్టులో ఈ నెల 7న ఆమె బెయిల్ పిటిషన్ విచారణ జరిగింది. ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖర ఆమె బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించారు. అసలు బెయిల్ ఎందుకివ్వాలంటూ ప్రశ్నించారు. అమ్మకు బెయిల్ రావాలంటూ తమిళనాడు ప్రజలు చేసిన పూజలు నిష్ఫలమయ్యాయి. జయ బెయిల్ పిటిషన్‌పై కర్ణాటక హైకోర్టులో విచారణ జరిగేరోజు తమిళనాడు అంతా కూడా టెన్షన్ నెలకొంది. జయకు బెయిల్ కోసం రాంజెత్మలానీ వంటి సీనియర్ న్యాయవాది రంగంలోకి దిగడంతో ఇక ఆమెకు బెయిల్ వచ్చినట్లేననుకున్నారు. అమ్మకు బెయిల్ రావాలని కోరుతూ వీరభక్తులందరూ పూజలు నిర్వహించారు. ఆరోజు సాయంత్రం మొదట జయకు బెయిల్ అంటూ న్యూస్ ఛానెల్స్‌లో బ్రేకింగ్‌న్యూస్ రావడంతో అంతా స్వీట్లు పంచుకుని, ఔట్లు పేల్చుకుని పండుగ చేసుకున్నారు. కాని కొన్ని నిముషాలలోనే ఆ ఆనందం ఆవిరి.. జయకు బెయిల్ నిరాకరణ అంటూ బ్రేకింగ్ న్యూస్... తమిళ ప్రజల్లో ఒక్కసారిగా నిరాశ. మొత్తానికి జయకు జైలు జీవితం తప్పేట్లులేదు.



# కొత్త కమిషనర్‌తోనైనా కార్పొరేషన్ మారేనా?

- ఫలించిన నెల్లూరీయుల 'ఐఏఎస్' కోరిక
- ఐఏఎస్ అనిపించుకుంటాడా?..

## అయ్యా... యస్ అని సరిపెట్టుకుంటాడా...??

**తరతరాలుగా తరగని నిర్లక్ష్యం, పేరుకుపోయిన అవినీతి, అల్లుకుపోయిన అక్రమాలు, అధికారులకు కలెక్షన్‌లు, అక్రమంగా కనెక్షన్‌లు, చిల్లర పడిందంటే ఎలాంటి చిల్లరపనులకైనా సై అనే సిబ్బంది, చిత్తశుద్ధితో పాటు చిత్తశుద్ధిలేని పారిశుద్ధ్య విభాగం, నగరం నిండా ఇరుకు సందులు, మురికి పందులు, ముదురుదోమలు... వీధివీధినా చెత్తకొండలు, ప్రతి సెంటర్‌లోనూ డ్రైనేజీ లీకులు... వీటితో పాటు దోమలకన్నా ముదురు సిబ్బంది, దొరికిన మేరకు దోచుకునే లంచావతారాలు... ఇదీ సుందర నెల్లూరునగర కార్పొరేషన్ స్వరూపం.**

నెల్లూరు పట్టణం నగరంగా మారింది. మున్సిపాల్టీ కార్పొరేషన్ అయ్యింది. కాని నెల్లూరునగర రూపురేఖలు మాత్రం నానాటికీ దిగజారి పోయాయి. గత పదేళ్లలో చూస్తే రాష్ట్రంలో చిన్నచిన్న పట్టణాలు కూడా ఎంతో అందంగా, అధునాతనంగా అభివృద్ధి చెందాయి. కాని నెల్లూరుకు ఆ భాగ్యం లేకుండా పోయింది. కోట్లకు కోట్లు నిధులు ఖర్చు చేస్తున్నా నగరంలో పరిస్థితులు మాత్రం ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా వున్నాయి. గత పాలకవర్గాలు కార్పొరేషన్‌ను భ్రష్టు పట్టించాయి. పాలకులు గాని అధికారులు గాని సొంత రాబడిపై పెట్టిన శ్రద్ధ

(మిగతా 10వ పేజీలో)

ఈ గబ్బు వదిలించడం చక్రధర్‌కు సవాలే!



# ఆత్మకూరు అభివృద్ధికి కళ్లెం

ఒక్కో సమయంలో ఒక్కో ప్రాంతానికి మహర్దశ పడుతుంటుంది. ఇలాంటి మహర్దశే ఆత్మకూరు పట్టణానికి ఆనం రామనారాయణరెడ్డి ఆర్థికశాఖ మంత్రిగా ఉండగా పట్టింది. 2009ఎన్నికల్లో ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు నుండి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. వెంటనే వై.యస్. కేబినెట్‌లో మున్సిపల్ శాఖ మంత్రి అయ్యారు. ఈ పదవిలో ఉండగానే పంచాయితీగా వున్న ఆత్మకూరుకు మున్సిపాల్టీ హోదా తెప్పించాడు. అంతకుముందు ఆత్మకూరు పల్లెకు ఎక్కువ పట్టణానికి తక్కువ అన్నట్లుగా వుండేది. గత పాతికేళ్లలో చూస్తే జిల్లాలో సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, బుచ్చిరెడ్డిపాలెం, పొదలకూరు, వింజమూరు వంటి పట్టణాలు ఎంతగానో విస్తరించాయి. కాని ఆత్మకూరు మాత్రం పాతికేళ్ల క్రితం ఎలా ఉండేదో ఆనం ఎమ్మెల్యే అయ్యేటప్పటికి అలాగే వుండిండి. ఒక మోస్తరు పట్టణాలలో కూడా మంచిహాస్పిటల్స్ వచ్చాయి. ఆత్మకూరులో మాత్రం పురాతనంగా వున్న బివిఎస్ఆర్ హాస్పిటల్స్, కెకెఆర్ ఆసుపత్రి తప్ప రెండో దిక్కు లేకుండాపోయింది.

కాని ఆనం ఆత్మకూరును మున్సిపాల్టీగా మార్చించడంతో అభివృద్ధి పరంగా కొంత కదలిక వచ్చింది. కిరణ్‌కుమార్‌రెడ్డి కేబినెట్‌లో ఆనం రామనారాయణరెడ్డికి ఆర్థికశాఖ వచ్చింది. దీంతో ఆత్మకూరుకు సుడి తిరిగినట్లయ్యింది. ఆత్మకూరు కోసం ఆనం నిధుల వరద పారించాడు. సోమశిల హైలెవల్ కెనాల్ వంటి భారీ ప్రాజెక్ట్‌తో పాటు అప్పారావుపాలెం వద్ద పెన్నానది మీద వంతెన మంజూరు చేయించాడు. ఇక ఆత్మకూరులో వందపడకల ఆసుపత్రి, పాలిటెక్నిక్ కాలేజీ, ఆర్డీవో ఆఫీసు, రహదారులకు, మంచినీటి పథకాలకు వందలకోట్ల రూపాయలు మంజూరు చేయించారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో పెద్దఎత్తున పనులు జరిగాయి.

కాని రాష్ట్ర విభజన జరగడం, ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో ఆత్మకూరు అభివృద్ధికి కళ్లెం పడింది. మొన్నటి ఎన్నికల్లో ఆత్మకూరు ఎమ్మెల్యేగా వైకాపా అభ్యర్థి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఎన్నికయ్యారు. తెలుగుదేశం ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాలలోనే పనులు జరగడం లేదు. ఇక వైకాపా ఎమ్మెల్యేలకు నిధులు ఎక్కడ నుండి వస్తాయి? ఏం అభివృద్ధి చేస్తారు? ప్రభుత్వం మారాక ఆత్మకూరులో అభివృద్ధి పని అంటూ లేకుండాపోయింది. పూర్తిగా నిరాశ అలుముకుంది. ఆనం రామనారాయణరెడ్డి వున్నప్పటి టైం ఇక ఆత్మకూరుకు రాకపోవచ్చు.

# ఇసుకకు మార్గం సుగమం




ఇప్పటివరకు ఇసుక బంగారంలా అమ్ముడుపోయింది. ఇసుకరీచ్‌లపై నిషేధం పెట్టడంతో లారీలు, ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా నిలిచిపోయింది. దీంతో ఎద్దుల బండ్లకు కాలం వచ్చింది. నిన్నటివరకు ఒక్కో బండి ఇసుక ధర వెయ్యిరూపాయల దాకా పలికింది. కాగా ఇసుకరీచ్‌లను మహిళా స్వయంసహాయక సంఘాలకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరుజిల్లాలో 77ఇసుకరీచ్‌లను గుర్తించారు. వీటిని ఆయా గ్రామ సమాఖ్యలకు అప్పగిస్తూ జిల్లా శాండ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఇసుక కావాల్సిన వారు క్యూబిక్ మీటర్‌కు 600రూపాయల వంతున గ్రామసమాఖ్య పేరుతో డిడి తీసి ఇసుకను పొందాల్సి వుంటుంది. త్వరలోనే గ్రామసమాఖ్యల ఆధ్వర్యంలో ఇసుకరీచ్‌లు మొదలు కానున్నాయి. దీంతో ఇసుక కష్టాలు కొంతవరకు తీరినట్లే!

***జిల్లా శాండ్ కమిటీ గుర్తించిన రీచ్‌లు***

నెల్లూరు రూరల్ మండలంలో దేవర పాళెం, పొట్టేపాలెం, ములుమూడి, గొల్ల కందుకూరు, సజ్జాపురం, కోడూరుపాడు, నవలాకులతోట, ఇందుకూరుపేట మండలంలో పల్లిపాడు, నాగరాజుతోపు, నిడుముసలి, ముదివర్తిపాలెం, కుడితిపాలెం, పొదలకూరు మండలంలో సూరాయపాలెం, విరువూరు, మహమ్మదాపురం, బుచ్చిరెడ్డిపాలెం మండలంలో జొన్నవాడ, మినగల్లు, శ్రీరంగరాజపురం, పల్లిపాలెం, దామరమడుగు, కోవూరు మండలంలో పోతిరెడ్డిపాలెం, జమ్మిపాలెం, వేగూరు, సుబ్బారెడ్డిపాలెం, విడవలూరు మండలంలో ముదివర్తి, కొండాపురం మండలంలో గుడవల్లూరు, బీమవరప్పాడు, ఆత్మకూరు మండలంలో అప్పారావుపాలెం, బండారుపల్లి, కనుపూరుపల్లి, అనంతసాగరం మండలంలో పడమటికంభంపాడు, కచిరిదేవరాయపల్లి, ఇసుకపల్లి, సంగం మండలంలో కోలగట్ల, పడమటిపాలెం, మక్తాపురం, చేజర్ల మండలంలో కోటితీర్థం, గూడూరు మండలంలో విందూరు, గొల్లపల్లి, తిప్పవరప్పాడు, బాలాయపల్లి మండలంలో నిండలి, సైదాపురం మండలంలో పాలూరు, కలువాయి బ్రిడ్జి, కలిచేడు, డక్కిలి మండలంలో దగ్గవోలు, కోట మండలంలో రుద్రవరం, గూడలి, తెన్నెలపూడి, కోట, పుచ్చలపల్లి, కర్లపూడి, వాకాడు మండలంలో ఎరగాటిపాలెం, తూపిలి, గంగన్నపాలెం, పామంజి, కాశీపురం, వాకాడు, బాలిరెడ్డిపాలెం, చిట్టమూరు మండలంలో గునపాడు, మెట్టు, పెళ్ళకూరు, ఎం.జంగాలపల్లి, గునపాటిపాలెం, నాయుడుపేట మండలంలో బీమవరం, చిగురుపాడు, తిమ్మాజీకండ్రిక, ఎల్‌ఏ సాగరం, తుమ్మూరు, అయ్యపరెడ్డిపాలెం, కలిపేడు, అన్నమేడు, మర్లపల్లి, సూళ్లూరుపేట మండలంలో కోటపోలూరు, ఎన్‌వి కండ్రిక, నూకలపాలెం, ఇల్లుపూరు, మంగానెల్లూరు, పెళ్ళకూరు మండలంలో పూళ్ళూరు, పాలచ్చూరు, పెళ్ళకూరులలో ఇసుక తవ్వకాలు జరుపుకోవచ్చు.

# జన్మభూమితో ఒరిగేదేముంది!

తెలుగుదేశం ప్రభుత్వం ఆర్భాటంగా చేస్తున్న జన్మభూమి కార్యక్రమం వల్ల జనానికి జరిగేది, ఒరిగేది ఏమీ లేదని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మనుబోలులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలోనూ తెలుగుదేశం ప్రభుత్వం జన్మభూమిని చేపట్టిందని, అప్పుడు ఏం ఒరగబెట్టారని ప్రశ్నించారు. తెలుగుదేశం కార్యకర్తలకు పని, పరపతిని కల్పించడానికే ఈ కార్యక్రమాన్ని పెట్టారని ఆయన విమర్శించారు. జన్మభూమిలో పింఛన్‌లు ఇస్తామని చెప్పి వృద్ధులను ఉదయం నుండి సాయంత్రం దాకా ఎండలో నిలబెడుతున్నారని, ఇది ఏ మాత్రం పద్ధతికాదన్నారు. ఇటీవల గ్రామకమిటీల పేరుతో 5వేల పింఛన్‌లు తొలగించారని, ఇప్పుడు జిల్లా కమిటీ పేరుతో 37వేల పింఛన్‌లు తొలగించడం దారుణమన్నారు. అర్హుల పింఛన్‌లను కూడా తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబుకు సొంత డబ్బా కొట్టుకోవడం తప్ప అభివృద్ధి పని ఒక్కటీ చేయడం లేదన్నారు. అధికారంలో లేకున్నా ప్రజల కోసం తాము నిరంతర పోరాటం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ వైస్‌ఛైర్మెన్ చిట్టమూరు పద్మనాభరెడ్డి, వైకాపా నాయకులు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌బికెఆర్‌లో న్యాక్ కమిటీ




కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలను సోమవారం యుజిసి అనుబంధ సంస్థ న్యాక్ కమిటీ పరిశీలించింది. ఈ విద్యాసంస్థలకు న్యాక్ రెన్యువల్ కొరకు ఈ కమిటీ వచ్చింది. ఈ కమిటీలో ప్రొఫెసర్ ఎం.ఆర్.ప్రణీష్, ప్రొఫెసర్ మోహన్.యు.దేశ్‌పాండేలు ఉన్నారు. న్యాక్ కమిటీ సభ్యులు విద్యార్థులు, పూర్వవిద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. కళాశాలలో విద్యాబోధనపై వాళ్లు చర్చించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు. ఈ కమిటీ సభ్యులు అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో కూడా సమావేశమై వారికి అందుతున్న జీతభత్యాలు, సౌకర్యాలపై చర్చించారు.

ఈ కమిటీ వెంట కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, జెఎన్‌టియు మాజీ వైస్‌ఛాన్సలర్ వి.గోపాలరెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి కూడా ఉన్నారు.

# ఒక్క హామీకి దిక్కులేదు

తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకిచ్చిన హామీలలో ఒక్కటీ నెరవేర్చలేదని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు.

సోమవారం స్వగ్రామమైన కోటకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటుతున్నా ముఖ్యమంత్రిగా చంద్రబాబు సంతకాలు చేసిన 5హామీలలో ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. ఋణమాఫీ విషయంలో రోజుకోమాట, నాయకులు తలోమాట మాట్లాడుతూ రైతులను, డ్వాక్రా మహిళలను అయోమయానికి గురిచేస్తున్నారని ఆయన విమర్శించారు. పింఛన్‌ల కమిటీలను అధికారపార్టీ నాయకులకే పరిమితం చేయడంవల్ల చాలామంది అర్హులకు అన్యాయం జరుగుతుందన్నారు. రాజకీయాలను పక్కనపెట్టి 65ఏళ్లు నిండిన వారందరికీ వృద్ధాప్య పింఛన్‌లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. చంద్రబాబు మాటలుతప్పు చేతలు కావని, ఆయన పాలనలో ఒరిగేది శూన్యమని ప్రజలకు ఇప్పటికే అర్థమైందన్నారు. అధికారం ఉందికదా అని మా పార్టీ కార్యకర్తలపై వేధింపులకు దిగితే సహించేదిలేదని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా వైకాపా అధ్యక్షుడు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు ఈ నెల 16న జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర వైకాపా నాయకులందరూ ఈ ఆందోళనలలో పాలు పంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

# జన్మభూమిలో పింఛన్‌ల జాతర!

'జన్మభూమి – మా ఊరు' పేరుతో జరుగుతున్న కార్యక్రమం పింఛన్‌ల జాతరను తలపిస్తుంది. జన్మభూమిలో పింఛన్‌ల గోడు తప్ప ఇంకేమీ వినిపించడం లేదు. గత ప్రభుత్వంలో ఉన్న పింఛన్‌లకు కత్తెరేసి మండలాలు, నియోజకవర్గాల వారీగా తెలుగుదేశం నాయకులు సిఫారసు చేసిన జాబితాలో వున్న వ్యక్తులనే పింఛన్ లబ్ధిదారులుగా ఎంపిక చేసే కార్యక్రమంలా ఇది జరిగిపోతుంది.

జన్మభూమిలో ప్రభుత్వపరంగా ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదు. జన్మభూమిలో పాల్గొంటున్న అధికారులు, నాయకులు కూడా చంద్రబాబు ఏ సోదియైతే చెబుతున్నాడో వీళ్లు అదే సోది చెపుతున్నారు. జన్మభూమికి వచ్చిన జనాలు పింఛన్‌ల దరఖాస్తులు ఇచ్చేస్తున్నారు.

గ్రామాలలో ఈ పింఛన్‌ల గొడవ ఎక్కువగా వుంది. ముఖ్యంగా పింఛన్‌లకు ఆధార్‌కార్డుతో ముడిపెట్టడంతో ఈ కార్డులు పొందని చాలామంది లబ్ధిదారులు పింఛన్‌ల జాబితా నుండి తొలగిపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. పింఛన్ లబ్ధిదారుల ఎంపికలో గ్రామ రాజకీయాలు ఎక్కువవుతున్నాయి. గ్రామాలలో ఎవరు ఏ పార్టీ వాళ్లనేది స్పష్టంగా ఉంటుంది. తెలుగుదేశం నాయకులే పింఛన్‌ల జాబితాలను రూపొందిస్తుండడంతో ఇతర పార్టీలలో వున్న అర్హులకు సైతం పింఛన్‌లు అందకుండా పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

# చక్రం ఊడింది

## ప్రయాణీకుల జాతకచక్రం బాగుంది

ఇటీవల కావలి డిపోకు చెందిన బస్సుకు వింజమూరు బంగ్లా సెంటర్ వద్ద పెద్ద ప్రమాదం తప్పింది. డిపో నుండి బయటకొచ్చే ముందు గ్యారేజీలో బస్సును తనిఖీ చేయాలి. కాని తనిఖీ చేయకుండానే బస్సును పంపారు. ఆ బస్సు వింజమూరు బంగ్లా సెంటర్‌కు వచ్చేసరికి ముందుచక్రం ఊడిపోయింది. దీంతో బస్సు ఒక వైపుకు ఒరిగిపోయింది. ఆ సమయంలో డ్రైవర్ వెంటనే స్పందించి బ్రేక్ వేయడంతో ప్రమాదం తప్పింది. బంగ్లా సెంటర్‌లో బస్సు నిదానంగా రావడంవల్ల ప్రమాదం లేకుండా పోయింది. బస్సును ఆపి ప్రయాణీకులను అక్కడే దించేశారు.

# చెంగాళమ్మ చెంత నాగూర్‌బాబు



నెల్లూరుజిల్లా సూళ్లూరుపేటలో కొలువైయున్న చెంగాళమ్మ అమ్మవారిని ప్రముఖ సినీగాయకుడు నాగూర్‌బాబు కుటుంబసభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయపాలకమండలి సభ్యులు స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి నాగూర్‌బాబును సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా నాగూర్‌బాబు మాట్లాడుతూ చెంగాళమ్మ తల్లి అంటే సత్యమైన దేవతగా అభివర్ణిస్తూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమన్నారు.

# సంప్రదాయబద్ధంగా స్వర్ణభారత్‌లో దసరా సంబరాలు



దసరా వేడుకలను ప్రారంభిస్తున్న వెంకయ్యనాయుడు, విక్టరీ వెంకటేష్

వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో విజయదశమి సందర్భంగా దసరా సంబరాలు ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. ప్రతిఏటా ఇక్కడ దసరా సంబరాలు ఎంతో వేడుకగా నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో గత ఈ నెల 4వ తేదీ నిర్వహించిన ఈ వేడుకలు మరింత సంతోష సంరంభాల మధ్య జరిగాయి. స్థానిక ప్రజలు, ఎంతోమంది నాయకులు, ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి వెంకయ్యానాయుడు మాట్లాడుతూ, ప్రపంచంలోకెల్లా భారతీయ సంస్కృతి సంప్రదాయలు ఎంతో గొప్పవని అన్నారు. మన సంస్కృతిని భావితరాలవారికి అందించాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. ప్రధాని మోదీ సారధ్యంలో మన దేశం మరింతగా ప్రగతి సాధిస్తుందని, అంతేకాక ఆధ్యాత్మిక విశ్వగురువుగా భారత్ ప్రత్యేక స్థానం సాధిస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రధాని మోదీ అమెరికా పర్యటన విజయవంత మైందన్నారు. జిల్లాకు మంచి భవిష్యత్తు వుందని, జిల్లా అభివృద్ధికి ఎలాంటి చిన్న అవకాశం వచ్చినా వదిలేది లేదని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తన వేతనాన్ని సామాజిక కార్యక్రమాలకు వెచ్చిస్తానని ప్రకటించిన సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన అభినందించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖ సినీ హీరో, విక్టరీ వెంకటేష్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతి కోసం స్వర్ణభారత్‌ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. రాష్ట్ర మంత్రులు గంటా శ్రీనివాసులు, కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు స్వర్ణభారత్ ట్రస్ట్ సేవలు ఒక వరమని అన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యానాయుడు మాట్లాడుతూ ఈ ట్రస్ట్ అభివృద్ధిలో తన తనయ దీపా వెంకట కృషి ఎంతో వుందన్నారు. ఈ వేడుకల్లో ఇంకా రాష్ట్ర అదనపు డీజీపి ఆర్పీ ఠాకూర్, తిరుపతి ఎంపి వరప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్, పండితుడు సింహాచల శాస్త్రి, ట్రస్టీలు టి.కృష్ణప్రసాద్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఉదయం 8 నుంచి 10 గంటల దాకా దేశభక్తుల, దేశ నాయకుల వేషధారణల పోటీలు నిర్వహించారు. అనంతరం ప్రముఖ నృత్యకళాకారిణి నదియా మహిషాసురమర్దిని నృత్యం అందరినీ ఆకట్టుకుంది. వేషధారణ పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. దసరా ప్రాశస్త్యం గురించి వివరించిన పండితుడు సింహాచలశాస్త్రిని వెంకయ్యానాయుడు ఘనంగా సత్కరించారు.



# నామమాత్రంగా 'జన్మభూమి'

## - ఎమ్మెల్యే అనిల్ విమర్శ



ప్రభుత్వం చేపడుతున్న జన్మభూమి కార్యక్రమంలో ప్రజల సమస్యలు తెలుసుకోకుండా, కొంతమందికి మాత్రమే పింఛన్లు ఇచ్చి, అర్హులైనవారి పింఛన్లు కొన్ని తీసివేసి, ఈ కార్యక్రమాన్ని నామమాత్రంగా నిర్వహిస్తున్నారని నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. నెల్లూరులోని 16వడివిజన్ బాలాజీనగర్‌లో వున్న బాజీపేట స్కూల్‌లో, 48వ డివిజన్‌లోని పాత మునిసిపల్ ఆఫీసులో జరిగిన జన్మభూమి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి పింఛన్లు అందజేశారు. ఐటిడిఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు పాలనలో కొత్త పింఛన్లు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదన్నారు. పేదలకు ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెప్పి నాలుగు నెలలవుతున్నా ఎక్కడా ఆచరణలో కనిపించడం లేదన్నారు. పింఛన్ల వెరిఫికేషన్ పేరుతో కమిటీలు వేశారని, అయితే ఆ కమిటీల్లో అన్ని పార్టీల సభ్యులను నియమించివుంటే బావుండేదని అన్నారు. ఎవరు ఎప్పుడు ఏ పార్టీలో వుంటారో, ఎప్పుడు ఎవరిని ముంచేసి వేరే పార్టీకి వెళతారో తెలియదు కాబట్టి, అర్హులందరికీ పింఛన్లు ఇచ్చేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, వైఎస్సార్సీపి ఫ్లోర్ లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, దామవరపు రాజశేఖర్, ఊటుకూరు మాధవయ్య, గోగుల నాగరాజు, ఎం.డి ఖలీల్ అహ్మద్, కుంచాల కృష్ణవేణి, వందవాసి పద్మ, మీదూరి ప్రశాంతకుమార్, కరతం ప్రతాప్‌రెడ్డి, గణేశం వెంకటేశ్వర్లు, దార్ల వెంకటేశ్వర్లు, శివపురం సురేష్, కాకుటూరు విజయ భాస్కరరెడ్డి, ఎస్కె సుభాన్, ముదిరెడ్డి లక్ష్మీరెడ్డి, ముడియాల దశరథరామిరెడ్డి, శింగంశెట్టి అశోక్, ఎం.మురళీకృష్ణ, అల్లం నరేంద్ర, విజయ్, సుబ్బయ్య, రామయ్య, శైలేంద్ర, మణి, కృష్ణలు పాల్గొన్నారు.

# నెల్లూరును 'మోడల్‌సిటీ'గా తీర్చిదిద్దుతా!

## - నెల్లూరు నగర కమిషనర్ చక్రధర్‌బాబు



రాష్ట్రంలో నెల్లూరును 'మోడల్ సిటీ'గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని నెల్లూరు నగర మునిసిపల్ కమిషనర్ కెవిఎన్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు. ఈ నెల 4న నగరపాలక సంస్థ కార్యాలయంలో పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ నూజివీడు సబ్‌కలెక్టర్‌గా పనిచేస్తూ కమిషనర్‌గా రావడం ఇదే తొలిసారి అన్నారు. వరంగల్‌లో ట్రైనీ కమిషనర్‌గా పనిచేసినందున కార్పొరేషన్‌పై అవగాహన ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు నెల్లూరుజిల్లా వాసులు కావడంతో ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. తాగునీరు, పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడతానని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఆకస్మిక తనిఖీలు, చెత్తపై అవగాహన కార్యక్రమాలు తదితర వాటిపై దశలవారీగా దృష్టి సారిస్తానన్నారు.

# 21నే బెగోరె అవార్డు సభ


## శిష్యుడి అవార్డు సభకు గురువు



డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు ప్రదానోత్సవసభ ఈ నెల 21వ తేదీ ఉదయం 11గంటలకు నెల్లూరులోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో జరుగనుంది. నటప్రపూర్ణ మోహన్‌బాబుకు ఈ సభలో బెగోరె అవార్డును ప్రదానం చేయనున్నారు. తన శిష్యుడికి ప్రతిష్ఠాత్మక అవార్డునందజేసే ఈ కార్యక్రమంలో మోహన్‌బాబు గురువు, దర్శకరత్న దాసరి నారాయణరావు కూడా పాలుపంచుకోనున్నారు. అలాగే ఈ సభలో తమిళనాడు గవర్నర్ కె.రోశయ్య, రాజ్యసభసభ్యులు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, శాంతా బయోటెక్స్ అధినేత కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే మాగుంట పార్వతమ్మ, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డిలు పాల్గొంటారని అవార్డు కమిటి కార్యదర్శి బి.వి.నరసింహం 'లాయర్'కు తెలియజేశారు.

# డా. ఎస్‌వి నరసింహులు సేవలు అమోఘం

## --- విగ్రహావిష్కరణ సభలో వక్తల ప్రశంస ---




ప్రముఖ విద్యావేత్తగా, ఎంతోమంది విద్యార్థుల భవితను తీర్చిదిద్దిన మహోన్నత వ్యక్తిగా స్వర్గీయ డా. శనగల వెంకట నరసింహులు విద్యారంగానికి చేసిన కృషి అమోఘమైనదని వక్తలు ప్రశంసించారు. ఈ నెల 5న డా. ఎస్‌వి నరసింహులు ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరులోని డైక్స్‌సెంటర్ ఎన్‌బిటి కాలనీలోని రత్నం మోడల్‌స్కూల్(సైన్ ఫౌండేషన్)లో ఆయన విగ్రహావిష్కరణ మహోత్సవం నిర్వహించారు. డా.ఎస్‌వి నరసింహులు విగ్రహాన్ని రత్నం విద్యాసంస్థల అధిపతి డా. కృష్ణకిషోర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు నగర ప్రముఖులు, విద్యావేత్తలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విద్యాభ్యాస సమయంలో ఎన్నో ఆర్థిక ఇబ్బందులు వున్నప్పటికీ, అన్ని కష్టాలనూ తట్టుకుని డా.ఎస్‌వి నరసింహులు విద్యావేత్తగా రాణించారని, జువాలజీ లెక్చరర్‌గా, కోరా ఎంసెట్ కోచింగ్ సెంటర్ నిర్వాహకునిగా, డికెడబ్ల్యు కళాశాల ప్రిన్సిపల్‌గా వేలాది మంది విద్యార్థుల భవితను తీర్చిదిద్దారని, ఆయన వద్ద విద్యను అభ్యసించిన ఎంతో మంది ప్రస్తుతం దేశవిదేశాల్లో ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారని వక్తలు ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నిరంజన్‌రెడ్డి (సింహపురి రైతు), డా అశోక్‌కుమార్, చలంచర్ల భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 7న పొదలకూరు మండలంలోని తన స్వగ్రామమైన తోడేరులో జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తున్న సర్వేపల్లి శాసనసభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి

# 'ప్రభా'తం

దేశానికి స్వాతంత్ర్యం కంటే పారిశుద్ధ్యమే ముఖ్యమని పూజ్య బాపూజీ ఆనాడే అన్నారంటే, పరిశుభ్రతకు ఆ మహనీయుడు ఎంత ప్రాధాన్యమిచ్చారో తేటతెల్లమవుతుంది. మంచి ఆహ్లాదకరమైన వాతావరణం అనారోగ్యాలను పారద్రోలి ఆరోగ్యానికి ఊపిరిపోస్తుంది. ప్రజలందరికీ మంచి ఆరోగ్యాన్నిస్తుంది. అందుకే పరిశుభ్ర భారత్ కావాలి. ఆ కల సాకారం కావాలి. పూజ్య బాపూజీ స్ఫూర్తితో, 'స్వచ్ఛ్ భారత్' పేరుతో నవతరం మహోనేత ప్రధాని నరేంద్రమోడీ పరిశుభ్ర భారత్‌కు శ్రీకారం చుట్టారు. అక్టోబర్ 2వ తేదీన గాంధీజయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా 'స్వచ్ఛ్ భారత్ అభియాన్' అనే మహోన్నత కార్యక్రమాన్ని ప్రధాని మోడీ ప్రారంభించడం ఒక చరిత్రాత్మకమైన విషయం. సహజంగా ఆయనకు వున్న ఉన్నతాదర్శాలకు, ప్రజల సంక్షేమం పట్ల వున్న గాఢమైన విశ్వాసానికీ, నిబద్ధతకు ఇది ప్రత్యక్ష నిదర్శనం. దేశప్రజలందరూ మనసా వాచా కోరుకునే ఆరోగ్య భారత్ సాధనకు ఇది తొలిమెట్టు అనవచ్చు. ఈ కార్యక్రమాన్ని కేవలం నినాదప్రాయంగా కాక, ఆచరణ సాధ్యం అయ్యేందుకు, ఆశించిన లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన ఖచ్చితమైన ప్రణాళికలను రూపొందించడం, పరిశుభ్రత పరిరక్షణకు గాను దాదాపు రెండు లక్షల కోట్ల రూపాయలను కేటాయించడం ఎంతో విశేషం.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడిచిపోతూనే వున్నా, ఇంకా అనేక ప్రాంతాల్లో ఆశించిన అభివృద్ధికి చేరువ కాలేదు. నేటికీ అనేక గ్రామీణ ప్రాంతాలు నిత్యం సమస్యలతో సతమతమవుతూనే వున్నాయి. ఇప్పటికీ కోట్లాది మంది ప్రజలు ఆకలితో అలమటిస్తూనే వున్నారు. పేదరికంతో, లేనిపోని అనారోగ్యాలతో, అజ్ఞానంతో, అనేకరకాల బాధలు పడుతూనే వున్నారు. ఎంతోమంది నిరుపేద కుటుంబాలవారు, ఎలాంటి కనీసవసతులకు నోచుకోలేక ఇబ్బందులతోనే జీవితాలు సాగిస్తున్నారు. దేశంలోని అనేకప్రాంతాల్లో ఎంతోకాలంగా ఆరుబయటనే కాలకృత్యాలు తీర్చుకునే దయనీయ పరిస్థితి వుంది. అనేక పాఠశాలల్లో బాలికలకు మరుగుదొడ్ల వసతి కూడా లేక నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో పేదలు, బడుగు బలహీనవర్గాల వారు, దళితుల జీవితాలు మరింత దయనీయంగానే వుంటున్నాయి. ఇలా ఎంత కాలం?..అందుకే ఈ దుస్థితి మారాలి. ప్రజలందరికీ ప్రగతి ఫలాలు అందాలి. అందరూ సుఖశాంతులతో జీవించాలి. ఇదే లక్ష్యంతో ప్రధాని నరేంద్రమోడీ ముందడుగు వేస్తున్నారు. పరిశుభ్రతకు ఎంతో ప్రాధాన్యత ఇస్తూ, జాతి అంతా సంతోషించే మహత్తర పథకానికి ప్రధాని మార్గం వేశారు. అదే 'స్వచ్ఛ్ భారత్' అభియాన్ పథకం.

## 'స్వచ్ఛ'ంధ ఉద్యమం



**ప్రతి ఒక్కరూ ప్రతిఒక్కరి బాగు కోసం స్వచ్ఛంధంగా ముందుకు రావాలి. మన మురికిని మనం దూరం చేసుకోవాలి. మన చుట్టూ వున్న మురుగును దూరం చేయాలి. ఇదే అందరి లక్ష్యం కావాలి. పరిశుభ్ర భారత్ లక్ష్యంగా మన దేశం అడుగులు వేస్తూ... ప్రగతిపథంలో మరింతగా పురోగమించాలి.**

సరిగ్గా జాతిపిత మహాత్మాగాంధీ 145వ జయంతినాడు ఈ బృహత్తర పథకానికి శ్రీకారం చుట్టడం మరింత అభినందనీయం.. దేశంలోనే అతిపెద్ద పరిశుభ్రత కార్యక్రమాన్ని ప్రధాని మోడీ ఈ సందర్భంగా ఎంతో స్ఫూర్తిమంతంగా ప్రారంభించారు. ఢిల్లీలోని రాజ్‌పథ్ రోడ్డులో ఆయన స్వయంగా చీపురు చేతపట్టి, చెత్త వూడ్చి ఈ కార్యక్రమం పట్ల తనకున్న చిత్తశుద్ధిని, అంకితభావాన్ని నిరూపించుకున్నారు. ఈ సందర్భంగా, దేశాన్ని పరిశుభ్రంగా మారుస్తామంటూ ప్రజలచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం రాజకీయాలకు అతీతమైనదని, దేశభక్తి నుంచి స్ఫూర్తి పొందిన కార్యక్రమమనీ, ఇందులో రాజకీయాలు చేరితే మరోసారి భరతమాత సేవలో మనం విఫలమైనట్లేనని గుర్తుంచుకోవాలని ప్రధాని మోడీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆయన మాటల్లో దేశభక్తి తొణికిసలాడింది.

సమాజానికి మంచి ఆరోగ్యకర వాతావరణాన్ని ప్రసాదించాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ పథకం ప్రజలందరిలో సరికొత్త స్ఫూర్తిని నింపింది. పరిశుభ్రమైన భారతదేశం నిర్మాణానికి జాతీయోద్యమం నిర్వహించాలని, అందుకు కేంద్రప్రభుత్వమే సారథ్యం వహించాలని, 2019 నాటికి మరుగుదొడ్డి లేని ఇల్లు కానీ, విద్యాసంస్థ కానీ, కార్యాలయం కానీ వుండకూడదని, బహిరంగ ప్రదేశాల్లో కాలకృత్యాలు తీర్చుకునే అలవాటుకు స్వస్తి చెప్పాలని, ఆ మేరకు ప్రజల్లో అవగాహన కల్పించి, స్వచ్ఛమైన.. పరిశుభ్రమైన వాతావరణం సర్వత్రా వుండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నదే ప్రధాని సంకల్పం. ప్రజలు ఇబ్బందులు పడకుండా ఎక్కడికక్కడ మరుగుదొడ్లు ఏర్పాటుచేసి, గ్రామగ్రామానా పరిశుభ్రతను ఫరిడవిల్లజేసేందుకు, తద్వారా పారిశుద్ధ్య పరిరక్షణకు, 'స్వచ్ఛ భారత్' నిర్మాణానికీ ప్రధాని చేస్తున్న బృహత్తర ప్రయత్నం ఇది. అందుకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో సహకరించాలి. పరిశుభ్ర భారత్‌లో అందరూ భాగస్వాములు కావాలి. వారానికి రెండు గంటలపాటైనా పరిశుభ్రత పరిరక్షణకు కృషి చేయాలి. తాము నివాసం వుంటున్న ప్రాంతాలను, పరిసరాలను, కార్యాలయాలను, ప్రాంగణాలను పరిశుభ్రంగా వుంచుకోవాలి. పరిసరాల్లోని మురుగుకాల్వలను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేసుకోవాలి. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయకుండా చూడాలి. పాఠశాలల్లో బాలికల కోసం ప్రత్యేక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలి. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను ప్రోత్సహించాలి. గ్రామీణ మహిళల కోసం మరుగుదొడ్లను నిర్మించాలి. గ్రామీణ ప్రాంతాల్లో బహిరంగ మలవిసర్జనను నిర్మూలించాలి... ఇది కేవలం నినాదప్రాయంగానో, ఎవరికి వారు ప్రచారార్భాటాలకి ఉపయోగపడే కార్యక్రమంగానో భావించకుండా, ప్రతి ఒక్కరూ ప్రతిఒక్కరి బాగు కోసం స్వచ్ఛంధంగా ముందుకు రావాలి. మన మురికిని మనం దూరం చేసుకోవాలి. మన చుట్టూ వున్న మురుగును దూరం చేయాలి. ఇదే అందరి లక్ష్యం కావాలి. పరిశుభ్ర భారత్ లక్ష్యంగా మన దేశం మరింతగా పురోగమించాలి.

పరిశుభ్ర భారత్ అనేది ప్రభుత్వం కోసం కాదు.. ప్రజలందరి కోసం అన్నది గుర్తుంచుకోవాలి. మనల్ని మనం ఆరోగ్యంగా వుంచుకునేందుకు, పరిశుభ్రతతో మన ప్రాంతాల్ని మనం సుందరంగా తీర్చిదిద్దుకునేందుకు ఇంతకంటే మంచి అవకాశం ఇంకెప్పుడు వస్తుంది?..ప్రజలందరికీ మేలైన ఈ ఉద్యమాన్ని ప్రతిఒక్కరూ నిండుగుండెతో స్వాగతించాలి. అటు ప్రభుత్వం, ఇటు ప్రజలు అందరూ కలిసి సమన్వయంతో, ఉద్యమస్ఫూర్తితో ముందుకు సాగినప్పుడే పరిశుభ్ర భారత్ కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది. పరిశుభ్రతను ప్రగతికి సూచికగా అందరూ గుర్తించాలి. పరిశుభ్రతను దైవంతో సమానంగా భావించాలి. ప్రతిప్రాంతం పచ్చదనంతో కళకళలాడేందుకు మాటలు కాదు..చేతలు చూపాలి.. అందుకు ఏదో ఒక రోజు కేటాయిద్దామని కాక, ప్రతి నిత్యం కొంత సమయాన్ని పారిశుద్ధ్య పరిరక్షణకు కేటాయించాలి. ఒక్క మన ఇల్లే కాదు, మన పరిసరాలు, మన వీధి, మన వాడ, మన వూరు, మన మండలం, మన జిల్లా, మన రాష్ట్రం..ఇలా మొత్తంగా మన దేశం.. ఎక్కడ చూసినా పరిశుభ్రతతో ఫరిడవిల్లాలి. అన్ని ప్రాంతాలూ..పచ్చదనంతో పరిమళించాలి. ఇదే అందరి ఆకాంక్ష కావాలి. ఆ ఆకాంక్షను అందరం కలిసి నెరవేర్చుకోగలగాలి. ఎంతో మహోన్నతమైన ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఎంతో దృఢంగా సంకల్పించిన ప్రధానికి ముందుగా అభినందనలు. ప్రభుత్వం-ప్రజలు తలచుకోవాలే కానీ సాధ్యం కానిదేదీ వుండదు. పరిశుభ్ర భారత్‌కు ఇదే మంచి తరుణం. ఈ కలను అందరం కలిసి సాకారం చేసుకోవాలి. అప్పుడే పరిశుభ్ర భారత్‌తో పాటు 'శ్రేష్ఠ భారత్' కూడా త్వరలోనే మన కళ్ళ ముందు సాక్షాత్కరిస్తుంది.

# నెల్లూరులో వేడుకగా 'బక్రీద్'



రోజుకు అయిదు సార్లు నమాజు చదివితే పాపాల నుండి విముక్తి పొంది పరిశుద్ధమవుతారని బారాషాహిద్ దర్గా ఈద్గా ఇమామ్ సయ్యద్ అబూ బకర్ అష్రఫి సాబిరి అన్నారు. నెల్లూరు దర్గామిట్టలోని బారాషాహిద్ దర్గా ఈద్గా మైదానంలో బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం ఖుత్బా సందేశానిచ్చారు. ఇస్లాం ప్రకారం సర్వమానవాళి సమానత్వంలో సత్ప్రవర్తన, సచ్ఛీలత, సత్సంబంధాలు, అప్యాయత ఇతరులకు సహాయపడే గుణం కలిగిన వాడే గొప్ప వ్యక్తని వివరించారు. ఇస్లాం అంటే విధేయత సమర్పణ అని వీటిని శిరసావహించి పాటించేవాడే ముస్లీం అన్నారు. ఇస్లాం త్యాగానికి ప్రతీకని, హింస, రక్తపాతం, ఇతరులకు హాని తలపెట్టడం లాంటి చర్యలను ఇస్లాం అనుమతించదన్నారు. ఉగ్రవాదం అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడే గ్రూపులకు ముస్లీంలను ముడిపెట్టడం సరికాదన్నారు. అనంతరం ఈద్గా మైదానంలో సామూహిక నమాజులు చేసారు. ఈ సందర్భంగా నగర మేయర్ అబ్దుల్ అజీజ్, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, మైనారిటీ నాయకులు పాల్గొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

***బక్రీద్ కోలాహలం...***

ముస్లీం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం నెల్లూరు నగరం కోలాహలంగా మారింది. దర్గామిట్టలోని బారాషాహిద్ దర్గా మైదానానికి నగరం నలుమూలల నుంచి వేలాదిమంది ముస్లీం సోదరులు సామూహిక నమాజులు చేసేందుకు తరలి వచ్చారు. నమాజు చేసిన అనంతరం ప్రత్యేక దువాలు చేసి ఈద్ ముబారక్ అంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. బారాషాహిద్ దర్గాలో 12 మంది అమరవీరుల మజార్లను దర్శించుకుని పాతెహాలు చేసారు. నగరంలోని ఈద్గామిట్ట, బర్మాషెల్‌గుంట, నజీర్‌తోట, జెండావీధి, తదితర ప్రాంతాల్లో సామూహిక నమాజులు అనంతరం ఇమామ్‌లు పండుగ సందేశం ఇచ్చారు.

## ఆధార్ ఇవ్వనివారికి గ్యాస్ కట్ - డిఎస్‌ఓ

జిల్లాలో ఆధార్ కార్డు ఇవ్వని దాదాపు 65వేల మంది గ్యాస్ వినియోగదారులకు సిలిండర్ల సరఫరా నిలిపివేసినట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి శాంతకుమారి పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 4,98,894 గ్యాస్ కనెక్షన్లున్నాయని, వాటిలో 75 శాతం మాత్రమే ఆధార్ సీడింగ్ జరిగిందని, ఆధార్ కార్డు ఇవ్వనివారికి గ్యాస్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఇకనైనా గ్యాస్ వినియోగదారులు ఆధార్ ప్రక్రియలో పాల్గొని ఎన్‌రోల్‌మెంట్ నంబరును సంబంధిత గ్యాస్ ఏజెన్సీలకు అందజేస్తే, వారికి యథావిధిగా గ్యాస్ సరఫరా వుంటుందని పేర్కొన్నారు.




## డాబులు తప్ప పనులేవి?

చంద్రబాబు అధికారంలోకి వచ్చింది మొదలు కోతలు కోయడం తప్ప ఆచరణలో ఒక్క హామీని నెరవేర్చడం లేదు. ఋణమాఫీ పేరు చెప్పి రైతులను నిలువునా మోసంచేశాడు. నేను మారానని చంద్రబాబు చెప్పుకుంటే నమ్మి జనం మోసపోయారు. ఓట్ల కక్కుర్తి రాజకీయాలకు పాల్పడుతూ ఆంధ్రాను అభివృద్ధి కాకుండా చేస్తున్నాడు.

జి. మహేంద్రరెడ్డి, కావలి.

## భక్తుల బాధలు

తిరుమలలో సామాన్య భక్తులకు ఇబ్బందులు ఎక్కువవుతున్నాయి. వివిఐపిలు పెరిగిపోతున్నారు. గదులు, దర్శనాలు వాళ్ళకే సరిపోతున్నాయి. సామాన్యభక్తులు వసతి కోసం గదులు దొరకక నానా అగచాట్లు పడుతున్నారు. స్వామివారి దర్శనం కోసం గంటలు ఒక్కోసారి రోజులకొద్ది క్యూలలో వేచివుండాల్సి వస్తుంది. వివిఐపిల సేవను తగ్గిస్తే భక్తుల అగచాట్లను కొంత తగ్గించవచ్చు.

- పీలేటి శ్యామ్‌మోహన్, వాకాడు.

## ఉచ్చ నెల్లూరు చేస్తున్నారు

'స్వచ్ఛ భారత్' అని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు. నెల్లూరులో కొందరు 'ఉచ్ఛ నెల్లూరు'ను అమలు చేస్తున్నారు. వీరికి సిగ్గు-లజ్జ లేదు. నలుగురూ చూస్తున్నారన్న ఇంగితజ్ఞానం కూడా లేదు. ఎక్కడబడితే అక్కడ గోడలకు నిలబడుకుని మూత్రవిసర్జన చేస్తున్నారు. వీళ్ళకంటే కుక్కలు నయం. ముందు ఇలాంటివారిలో మార్పు తేవాలి.

సి.గోపి, నెల్లూరు.

## ఒక్కరోజు సరిపోదు

ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుతో భారత దేశమంతటా "స్వచ్ఛ భారత్" పేరుతో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమే. కాని ఈ పరిశుభ్రత ఒక్కరోజుకే పరిమితం కాకూడదు. పారిశుధ్యంపై భారత ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉంది. మన పరిసరాలు శుభ్రంగా వుంటేనే మన ఆరోగ్యం బాగుంటుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళాలి. అలా జరిగిన రోజే నిజమైన 'స్వచ్ఛభారత్' తయారవుతుంది.

జె.యస్.కృష్ణ, నెల్లూరు.

# గురువుపై కోపం... శిష్యుడికి శాపం




**జిల్లా తెలుగుదేశంపార్టీలో వర్గ విభేదాలు భగభగ మండుతున్నాయి. సోమిరెడ్డికి మంత్రి నారాయణకు పడదు. ఆదాలకు సోమిరెడ్డికి పడదు. నెల్లూరు కార్పొరేషన్‌లో తెలుగుదేశం కార్పొరేటర్లకు వైకాపా నుండి తెలుగుదేశంలో చేరిన అజీజ్ బ్యాచ్‌కు పడదం లేదు. ఇంతగా వర్గవిభేదాలున్నప్పుడు నేతల మధ్య సమన్వయం కుదరాలంటే చాలా సమయం పడుతుంది. జిల్లాకు నేతృత్వం వహించే నాయకులు దీనిపై సమయస్ఫూర్తి ప్రదర్శించాలి. ఓర్పు, నేర్పు ఉండాలి. శత్రువును కూడా స్నేహితుడిని చేసుకునే స్వభావం ఉండాలి. కాని రాజకీయాలలో రాటుదేలకపోవడం, రాజకీయానుభవం లేకుండానే మంత్రి కావడం, మంత్రి కాగానే పనిభారం పెరగడంతో మంత్రి నారాయణకు ఇవన్నీ వంటపడుతున్నట్లు లేదు.**




మొన్న ఒకరోజు నెల్లూరు కార్పొరేషన్ కౌన్సిల్‌హాల్‌లో జరిగిన ఓ సంఘటన జిల్లాలోనే చర్చనీయాంశంగా మారింది. ఆ సమావేశానికి కార్పొరేటర్లందరూ రాలేదని చెప్పి మంత్రి నారాయణ 8వ డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ జడ్.శివ ప్రసాద్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏం గ్రూపురాజకీయాలు చేస్తున్నారా? ఎవరేం చేస్తున్నారో నాకు తెలుసు, మేయర్ బాగాలేక పడుకోనుంటే కార్పొరేటర్లందరినీ సమన్వయపరచి సమావేశానికి తీసుకురావాల్సిన బాధ్యత నీకు లేదా? పార్టీలో ఇష్టముంటే ఉండండి, లేకుంటే వెళ్లిపోండి అంటూ నిప్పులు కక్కారు. ఈ సమయంలో జడ్.యస్ మౌనం దాల్చాడు కాబట్టి సరిపోయింది. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి లేదా కొమ్మి లక్ష్మయ్యనాయుడు వంటి నాయకులు జడ్.యస్ స్థానంలో వుంటే పరిస్థితి ఏ విధంగా వుండేది. ఖచ్చితంగా అక్కడే తిరగబడేవాళ్లు. ఎందుకంటే మంత్రి క్రింద కార్పొరేటర్లు జీత గాళ్లు కాదు. ఎవరి స్థాయిలో ఆత్మాభిమానం వాళ్లకుంటుంది. చిన్న నాయకులైనా, పెద్దనాయకులైనా పెద్దపదవుల్లో ఉన్నోళ్లు గౌరవించి మాట్లాడితేనే వీళ్లు గౌరవాన్ని నిలబెట్టుకుంటారు.

### ఈ కోపానికి కారణం

డాక్టర్ జడ్.యస్.పై నారాయణ ఆగ్రహం వ్యక్తం చేయడం అత్తమీద కోపం దుత్తమీద చూపినట్లుగా వుంది. సోమిరెడ్డి మీద వచ్చిన కోపాన్ని నారాయణ సోమిరెడ్డి ప్రధాన అనుచరుడు జడ్.యస్ మీద తీర్చుకున్నట్లుగా తెలుస్తుంది. ఈ సంఘటనకు ముందురోజే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు నెల్లూరుకొచ్చారు. పక్కరోజు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగే దసరా వేడుకలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొనాల్సివుంది. ముందురోజు రాత్రి గంటా కొడుక్కి, నారాయణ కూతురుకి వివాహ సంబంధం మాట్లాడుకున్నారు. సోమిరెడ్డికి ఈ విషయం తెలియదు. తనకు చెప్పకుండానే గంటా తన నియోజకవర్గంలో జరిగే కార్యక్రమానికి వస్తున్నాడని భావించిన సోమిరెడ్డి గంటాకు ఇదే విషయమై ఫోన్ చేసి నిలదీసినట్లు తెలిసింది. నారాయణ అంటే కొత్త... ఆయనకు రాజకీయ సంప్రదాయాలు తెలియవు, సీనియర్‌వి, నీకన్నా తెలియాలి. ఒక నియోజకవర్గంలో కార్యక్రమానికి వచ్చేటప్పుడు ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌కు చెప్పవా అని అడిగాడని తెలుస్తుంది. దీని మీద గంటా సర్దిచెప్పుకున్నాడు. ఇది తెలిసి నారాయణ మనస్థాపానికి గురయ్యాడు. తన ఇంటికి అతిథిగా వచ్చిన గంటా శ్రీనివాసరావును సోమిరెడ్డి కడిగేయడంతో నారాయణ జీర్ణించుకోలేక పోయాడు. పక్కరోజు ఆ కోపాన్నంతా జడ్.యస్ మీద ప్రదర్శించినట్లు సమాచారం.

### అజీజ్ పరిస్థితి అంతే!

ఆదివారం రాత్రి నారాయణ ఆసుపత్రి వద్ద కార్పొరేటర్లందరికీ విందు సమావేశం ఏర్పాటు చేశారు. అజీజ్ బ్యాచ్‌తో పాటు తెలుగుదేశం కార్పొరేటర్లు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ అజీజ్‌కు కార్పొరేటర్ కిన్నెర ప్రసాద్‌కు స్వల్ప వివాదం జరిగింది. ఏ సమావేశానికి మేయర్ మమ్మల్ని పిలవడం లేదని కిన్నెరప్రసాద్ ఆరోపిస్తే, కార్పొరేటర్లకు సంపాదించుకునే అవకాశమివ్వడం లేదని నాపై నిందలు వేస్తున్నారని అజీజ్ ఆరోపించాడు. దీంతో అజీజ్‌కు కిన్నెరకు మాటామాటా పెరిగింది. ఈ సమయంలో నారాయణ తీవ్రంగా స్పందించి అజీజ్‌ను కూర్చో అంటూ ఆగ్రహంగా అరిచాడు. మీరు నాలో కోపాన్ని ఐదు శాతమే చూశారు. 95శాతం అలాగే వుంది. అది కూడా చూపానంటే మీరు తట్టుకోలేరు అని నారాయణ చెప్పగా వెంటనే జడ్‌యస్ లేచి నిన్న జరిగిన దాంట్లో నా తప్పేమీ లేదు. నాకే సమాచారం లేదని చెప్పాడు. అప్పుడు నారాయణ... అది కాదులే జడ్.యస్... నిన్న నీకు కోటింగ్ ఇచ్చాను కాబట్టి ఈరోజు సెట్ అయ్యావు, ఈరోజు ఇతనికి(అజీజ్‌కు) కోటింగ్ ఇచ్చాను కాబట్టి రేపటికి సెట్ అవుతాడని చెప్పి తర్వాత సబ్జెక్ట్‌లోకి వెళ్లాడు. ఈ కోటింగ్‌లు, మందలింపులు చూస్తుంటే మంత్రి నారాయణ అయ్యోరు మూడ్‌లోనే ఉన్నట్లుంది. ఆయన అయ్యవారుగా, కార్పొరేటర్లు స్టూడెంట్స్ మాదిరిగా అనిపిస్తుంది.

# అయ్యో... రామచంద్ర?



***ఒకే పార్టీ, ఒకే సిద్ధాంతం... ఒకటే జెండా, ఒకటే అజెండా... ఈ కోణంలో చూసినప్పుడు జిల్లాలో మనకు గుర్తుకొచ్చే నాయకులు ఇద్దరు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి, ముప్పవరపు వెంకయ్యనాయుడు. నేదురుమల్లి ముఖ్యమంత్రి స్థాయికి వెళ్లడం, వెంకయ్యనాయుడు కేంద్రమంత్రి స్థాయిలో ఉండడం వల్ల మనకు సులభంగా గుర్తుకు వస్తారు. పదవులు అనుభవిస్తున్నప్పుడు ఒకే పార్టీలో ఉండడం గొప్ప విషయం కాదు. ఎటువంటి పదవి లేక పోయినా దాదాపు 30ఏళ్లకు పైగా ఒకే పార్టీని, ఒకే సిద్ధాంతాన్ని కనిపెట్టుకుని ఉండడమనేది చాలా గొప్ప విషయం. అలాంటి గొప్ప కీర్తి వున్న నాయకుడే వేనాటి రామచంద్రారెడ్డి.***

1983లో తెలుగుదేశంపార్టీ ఆవిర్భవించాక ఆ పార్టీలో చేరాడు. ఇప్పుడున్న నాయకులందరిలోకి చాలా సీనియర్. చంద్రబాబు కూడా ఆయనకు జూనియరే! ఎందుకంటే చంద్రబాబు తెలుగుదేశంలోకి వచ్చింది 1985లో. ఈ జిల్లాలో ఇప్పుడున్న నాయకులను చూస్తే ఎవరికి కూడా అంత సీనియార్టీ లేదు. ఒకరకంగా చూస్తే రాష్ట్రంలోనే ఇన్నేళ్లు పార్టీ మార్చకుండా వున్న నాయకులను వేళ్ల మీద లెక్క పెట్టొచ్చు. అలాంటి వారిలో వేనాటి ఉండడం గొప్ప విషయమే.

1983లోనే జిల్లా పార్టీ కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత పార్టీ పరంగా ఎన్నో బాధ్యతలు నిర్వహించారు. తెలుగుదేశం ప్రభుత్వంలో సూళ్లూరుపేట చెంగాళమ్మ గుడి ఛైర్మెన్‌గా భక్తితో తన బాధ్యతలు నిర్వర్తించారు తప్పితే దానిని పదవిగా అనుభవించలేదు. సూళ్లూరుపేట నియోజకవర్గంలో తెలుగుదేశం బండిని వేనాటి మునిరెడ్డి, రామచంద్రారెడ్డి సోదరులు ఎద్దుల్లా మారి లాగారు. మునిరెడ్డి స్వర్గస్తులయ్యాక రామచంద్రారెడ్డి ఒక్కడే పోరాడుతూ ఇక్కడ పార్టీని పటిష్టంగా నిలబెట్టాడు. 1983, 1985, 1994, 1999, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ తెలుగుదేశం ఎమ్మెల్యేలను గెలిపించడంలో ప్రధానపాత్ర వేనాటిదే! 1989, 2004లలో కాంగ్రెస్, మొన్నటి ఎన్నికల్లో వైకాపా గెలిచింది. మొన్న కూడా పరసారత్నం బదులు ఇంకొకరిని పెట్టివుంటే తెలుగుదేశమే గెలిచివుండేది.

పార్టీ కోసం ఇంతగా పాటుపడ్డా పార్టీ అధికారంలో వున్నప్పుడు వేనాటికి పెద్దగా పదవులు లభించిందిలేదు. మొన్న జడ్పీ ఎన్నికల్లో మాత్రం ఆయనను ఛైర్మెన్ అభ్యర్థిగా ప్రకటించారు. కాని అదృష్టం వెంట్రుకవాసిలో తప్పింది. లాటరీ రూపంలో ఆశలు అడియాశలయ్యాయి.


తెలుగుదేశంలో వున్నప్పటికి వేనాటికి అటు మాగుంట కుటుంబంతోనూ, ఇటు ఆనం సోదరులతోనూ ఎంతో బలమైన సంబంధాలుండేవి. 2004లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు వేనాటిని కాంగ్రెస్‌లోకి తీసుకోవాలని తీవ్రంగా ప్రయత్నించారు. అప్పటి ముఖ్యమంత్రి దివంగతనేత వై.యస్.రాజశేఖరరెడ్డి కూడా వేనాటిని పార్టీలోకి ఆహ్వానించారు. కాని ఆయన పార్టీ మారాలనే ఆలోచన చేయలేదు. తెలుగుదేశంలోనే ఉండిపోయాడు. 2004 నుండి 2014 వరకు తెలుగుదేశం ప్రతిపక్షంలో వున్నా సూళ్లూరుపేట నియోజకవర్గంలో అన్నీ తానై పార్టీని నడిపించాడు. ఆర్థికంగా నష్టపోయాడు కూడా. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఒకే పార్టీని నమ్ముకుని ఒకే జెండాను పట్టుకున్న వేనాటికి ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం ఎటువంటి ప్రాధాన్యత కల్పించబోతుందన్నది ప్రశ్నగా మారింది. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి ఇస్తారనే ప్రచారం వుంది. ఇంకోపక్క టీటీడీ బోర్డు పాలకమండలిలో స్థానం కల్పిస్తారనేది సమాచారం. ఏదేమైనా పార్టీపట్ల విధేయతగల వారిని కాపాడుకుని గౌరవించడం చంద్రబాబు బాధ్యత!

# దుబాయ్ అద్భుత నిర్మాణాలలో నెల్లూరు ఇంజనీర్ పాత్ర



**ప్రపంచంలోనే అత్యంత అద్భుత నిర్మాణాలు కలిగిన దేశాలలో దుబాయ్ అగ్రస్థానంలో వుంటుంది. ఇక్కడ ఒక్కో భవనాన్ని చూస్తుంటే కళ్లు చెదురుతుంటాయి. ఇక్కడ ప్రతి భవనం ఆకాశాన్ని అందకోవడానికి ప్రయత్నిస్తున్నట్లుగా ఉంటుంది. ఈ అద్భుత భవనాల రూపశిల్పులైన ఇంజనీర్ల ప్రతిభకు ఎవరైనా సలాం కొట్టాల్సిందే! అలాంటి ప్రతిభావంతులైన ఇంజనీర్లలో మన నెల్లూరీయుడు కూడా ఒకరు ఉన్నారంటే దానికి మనమెంతో గర్వపడాలి. అలా మనం గర్వపడేలా చేసిన ఇంజనీర్ పేరే ఫజల్ రెహమాన్.**

మన నెల్లూరీయుడు. మూలాపేట వాసి. ఇక్కడే వున్న వేద సంస్కృత పాఠశాలలో చదివాడు. వేదాలను బట్టీ పట్టాడు. శ్లోకాలను అనాంతం చెప్పేస్తాడు. వేదపండితులకు ఏ మాత్రం తీసిపోని విధంగా గణపతి మంత్రం చదివేస్తాడు. ఒక మహ్మదీయుడి నోట శ్లోకాలు, వేదాలు, ఉపనిషత్తుల గురించి వింటుంటే ఎంతో అద్భుతమనిపిస్తుంది. మత సామరస్యం ఇక్కడే ఉందనిపిస్తుంది. దుబాయ్‌లో ఓ జర్మన్ కంపెనీలో ఇంజనీర్‌గా పనిచేస్తున్నా తన ఊరిని, తన స్కూల్‌ను తనకు చదువు చెప్పిన గురువులను మరచిపోలేదు ఫజల్ రెహ్మాన్. భారతదేశం నా తల్లి లాంటిదని చెప్పే రెహమాన్ దుబాయ్‌లో తన ఇంజనీరింగ్ ప్రతిభతో ఆకాశహర్మ్యాలు నిర్మించాడు.



దుబాయ్‌లో ప్రపంచంలో ఎత్తైన రెసిడెన్షియల్ బిల్డింగ్ 'ప్రిన్సెస్ టవర్' నిర్మాణంలో రెహమాన్ పాత్ర వుంది. 101అంతస్థులతో 414మీటర్ల ఎత్తుగల ఈ భవనం ఆకాశాన్ని తాకుతున్నట్లుగా ఉంటుంది. అలాగే దుబాయ్‌లోనే అత్యంత సుందరంగా నిర్మించిన 'బ్లూటవర్స్' నిర్మాణంలోనూ రెహమాన్ డిజైనింగ్ ప్రతిభ అమోఘమనిపిస్తుంది. భూకంపాలను, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే విధంగా ఫజల్ రెహమాన్ ఈ భవనాలకు సాంకేతిక డిజైన్ అందజేసారు. ముఖ్యంగా ఎంతటి తీవ్రమైన భూకంపం సంభవించినా ఈ భవనాలు చెక్కు చెదరకుండా ఉండేందుకు డిజైన్‌లో 'ఎక్స్', 'వై' పద్ధతులను అవలంభిస్తామని రెహమాన్ చెప్పారు. అనంతపురంలో జెఎన్‌టియు నుండి ఇంజనీరింగ్‌లో పట్టా తీసుకున్న ఫజల్ రెహమాన్ ఈరోజు దుబాయ్‌లో పేరుమోసిన ఇంజనీర్లలో ఒకడు కావడం అభినందనీయం.



# నెల్లూరు కబుర్లు

## చంద్రబాబు వస్తున్నాడు



రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 10వతేదీ నెల్లూరుజిల్లాలో పర్య టిస్తారు. 'జన్మభూమి- మా ఊరు' కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఆయన 10వతేదీ ఉదయం హైదరాబాద్ నుండి బయలుదేరి రేణిగుంట ఎయిర్‌పోర్టులో దిగుతారు. అక్కడనుండి హెలి కాప్టర్‌లో నెల్లూరులోని పోలీస్‌గ్రౌండ్‌కు చేరు కుంటారు. రోడ్డు మార్గాన కోవూరు మండలం, పోతిరెడ్డిపాలెంలో జరిగే గ్రామసభకు చేరుకుంటారు. అనంతరం కోవూరులో ఏర్పాటు చేసిన డ్వాక్రా సంఘాల సభలోనూ పాల్గొంటారు. భోజనం అనంతరం హెలికాప్టర్‌లో దక్కిలి చేరుకుని 'బడి పిలుస్తోంది', 'పొలం పిలుస్తోంది', 'నీరు-చెట్టు' వంటి కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇక్కడ డ్వాక్రా మహిళా సంఘాల సభలో పాల్గొని అనంతరం తిరిగి రేణిగుంటకు బయలుదేరుతారు.

## మహబూబ్‌ఖాన్ పార్క్ అభివృద్ధికి కృషి

**నెల్లూరు జిల్లా కలెక్టర్ శ్రీకాంత్**

నెల్లూరు నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రక్కనున్న మహబూబ్‌ఖాన్ పార్క్ అభివృద్ధికి కృషి చేస్తామని నెల్లూరు జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ రేఖా రాణి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళపాక అనురాధలతో కలసి స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ మహబూబ్‌ఖాన్ పార్కులో వాకర్స్ నడిచేందుకు వీలుగా వాకింగ్ ట్రాక్ నిర్మిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్ డిఆర్‌ఓ నాగేశ్వరరావు, ఏఓ రమేష్ నాయుడు డిఎస్‌ఓ శాంతకుమారి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కాయల సతీష్‌కుమార్, రాష్ట్ర నిర్వహణ కార్యదర్శి వై.మధుసూదనరావు, కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కిషోర్ రత్నం స్కూల్లో స్వచ్ఛాంధ్రప్రదేశ్

నెల్లూరు నగరం రిత్విక్ ఎన్‌క్లేవ్ లోని డాక్టర్ కిషోర్ రత్నం స్కూలు ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు లే అవుట్ లోని రోడ్లను శుభ్రపరిచారు. డాక్టర్ కిషోర్ రత్నం జెన్ నెక్స్ట్ స్కూల్ జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ ఉమారాణి, ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్ అనురాధ, కిడ్స్ ప్రిన్సిపల్ లత, మేనేజర్లు రఘురామ్, జితేంద్రరెడ్డి పాల్గొన్నారు.

# నయనానందకరం.. శ్రీ రాజరాజేశ్వరి నగరోత్సవం



విజయదశమి పర్వదినం సందర్భంగా ఈనెల 3వతేదీ రాత్రి నెల్లూరు, దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారు పులి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. విశేష పుష్పా లంకరణలతో స్వర్ణాభరిత శోభితురాలైన అమ్మవారి నగరోత్సవంలో భక్తులు విశేషపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయ కర్తలుగా ఆలూరు ఆదినారాయణరెడ్డి దంపతులు వ్యవహరించారు. 4వ తేదీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

**కన్యకాపరమేశ్వరి ఆలయంలో...**

నెల్లూరు, స్టోన్‌హౌస్‌పేటలోని శ్రీ కన్యకాపరమేశ్వరి ఆల యంలో శరన్నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో భాగంగా 4వ తేదీ వసంతోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారికి దర్బార్ అలంకారం జరిగింది. విజయదశమి సందర్భంగా 3వ తేదీ రాత్రి అమ్మవారు పులివాహనంపై నగరోత్సవంలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఛైర్మన్ మునగా వెంకటేశ్వర్లు, కమిటీసభ్యులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

## పోర్టులో రైల్వే మంత్రి

కేంద్ర రైల్వేశాఖ మంత్రి సదానంద గౌడ సోమవారం కృష్ణపట్నం పోర్టును సందర్శించారు. పోర్టు పరిధిలోని రైల్వే స్టేషన్‌లను పరిశీలించారు. పోర్టులో వసతులు, మౌలిక సదుపాయాలు బాగు న్నాయని పోర్టు అధికారులను అభినం దించారు. పోర్టు ద్వారా దక్షిణమధ్య రైల్వేకి ఎంత రాబడి పెరిగిందనే వివరా లను తెలుసుకున్నారు. సోమవారం ఉదయం మంత్రి పోర్టు నుండి ప్రత్యేక రైలులో బెంగుళూరుకు బయల్దేరి వెళ్లారు.

## రైల్వే డిఆర్ఎం నెల్లూరు స్టేషన్ పరిశీలన

కేంద్ర రైల్వే శాఖ మంత్రి నెల్లూరు జిల్లాకు రానున్న నేపధ్యంలో దక్షిణ మధ్య రైల్వే డిప్యూటి రైల్వే మేనేజర్ ప్రదీప్ కుమార్ ఆదివారం విజయవాడ నుండి నెల్లూరు రైల్వేస్టేషన్‌కు వచ్చారు. ఈ సందర్భంగా నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్ మేనేజర్ షేక్.షాజహాన్ స్వాగతం పలికారు. అతిథి గృహంలో విశ్రాంతి తీసుకున్న ప్రదీప్‌కుమార్ అనంతరం కృష్ణపట్నం పోర్టుకు వెళ్ళారు.

## కమనీయం శ్రీవారి కల్యాణం

నెల్లూరు, దర్గామిట్ట టిటిడి కల్యాణ మండపంలో ఈ నెల 4న శ్రీవారి కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. శ్రీవారి జన్మ నక్షత్రమైన శ్రవణం సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార మండలి సంయుక్త ఆధ్వర్యంలో అర్చక స్వాములు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి శాస్త్రోక్తంగా అభిషేకాలను నిర్వహిం చారు. అనంతరం కల్యాణ మహోత్సవాన్ని జరిపించారు. భక్తులు విశేషంగా పాల్గొని ఈ కల్యాణోత్సవాన్ని తిలకించారు. టిటిడి ధర్మప్రచార మండలి అధ్యక్షులు సి.వి.సుబ్ర హ్మణ్యం, ఉపాధ్యక్షుడు కొండా శేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో కల్యాణోత్సవం జరిగింది.

## నేత్రదానం



నెల్లూరు, సంతపేట వాస్తవ్యులు కారంశెట్టి వెంకట సుబ్బయ్య(64) ఈ నెల 4న పరమపదించారు. కుటుంబ సభ్యుల కోరికమేరకు డా॥ పిఎల్‌రావు నేతృత్వంలో ఐబ్యాంక్ టెక్నీషియన్ యండిబి ప్రసాద్, వెంకటసుబ్బయ్య నేత్రా లను సేకరించారు. నెల్లూరు అర్బన్ ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవిక్లబ్ సేవాకార్యక్రమాల్లో భాగంగా నేత్రదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

## విశాలాక్షి వృద్ధుల ఆశ్రమం బ్రాంచి ప్రారంభం

నెల్లూరు నగరం బాలాజీ నగర్ ఎక్స్‌టెన్షన్‌లో కోసూరు రత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విశాలాక్షి వృద్ధుల ఆశ్రమ బ్రాంచిని ఆదివారం ప్రముఖ సినీనటుడు చంద్ర మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధాశ్రమాన్ని నిర్వహించడం కష్టతరమని, విశాలాక్షి ఆశ్రమ నిర్వాహకులు రెండవ శాఖను ప్రారంభించడాన్ని కొనియాడారు. జీవితకాలం తమ సంతానానికి సేవలందించి చివరి దశలో ఆదరణ కోల్పోయిన వారిపై దయ చూపాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు.



ఆశ్రమాన్ని ప్రారంభిస్తున్న సినీనటుడు చంద్రమోహన్

# తీరప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

**- మత్స్యకార సంక్షేమ సమితి దశాబ్ది ఉత్సవాల్లో మంత్రి పి.నారాయణ**



రాష్ట్రంలో తీరప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ నేపథ్యంలో మత్స్యకారుల జీవనభృతికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా, వారి అభ్యున్నతికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. ఈ నెల 5న నగరంలోని జిపిఆర్ కల్యాణమండపంలో జరిగిన మత్స్యకార సంక్షేమ సమితి దశాబ్ది ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిల సంక్షేమానికి కట్టుబడి వుందన్నారు. జిల్లాలో మత్స్యకారుల కోసం ఫిషింగ్ హార్బర్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ఎంపి కె. హరిబాబు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా మత్స్య ఉత్పత్తుల ఎగుమతి ద్వారా రూ.30వేల కోట్లు ఆదాయం వస్తుండగా, ఇందులో ఆంధ్రప్రదేశ్‌నుంచే రూ.12వేల కోట్ల ఆదాయం వస్తోంద న్నారు. కాలుష్యం వల్ల మత్స్యసంపద దెబ్బ తింటోందని, చేపల వేటలో అధునాతన పద్ధతులపై మత్స్యకారులు శిక్షణ తీసుకోవా లని సూచించారు. రాష్ట్రంలోని మత్స్యకా రుల కోసం ఫిషింగ్ హార్బర్లతో పాటు, బోట్లు వున్న వారికి 50 శాతం రాయితీతో బోట్‌బోర్డు మోటార్ ఇచ్చేందుకు ప్రభు త్వంతో సంప్రదిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్న టిడిపి నాయకులు ఆదాల ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ, ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన సమయంలో మత్స్య కారులకు తగిన నష్టపరిహారం అందించి ఆదుకోవాలన్నారు. మత్స్యఉత్పత్తులు విక్ర యించుకునేందుకు తగు మార్కెటింగ్ వసతులు ఏర్పాటుచేయాలన్నారు. కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ తమిళనాడు-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య వివాదాలమయంగా వున్న పులికాట్ ముఖద్వారం సమస్యను పరిష్క రించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, సురేంద్ర రెడ్డి, ఆక్వా సంఘం అధ్యక్షుడు దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, మెరైన్ డిఎస్పీ రామకృష్ణ, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ బలరామ మూర్తి, మత్స్యకార సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు కాటంగారి వెంకటరమణయ్య, కార్యదర్శి పామంజి మురళి, మత్స్యకార నాయకులు కోలంగారి పోలయ్య, సామా జిక సమరసతా వేదిక ప్రముఖ్ శ్యాం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## చిరంజీవి యువత రక్తదానం

చిరంజీవి యువత ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ రక్తనిధిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా చిరంజీవి యువత అధ్యక్షులు వై.రవికుమార్ మాట్లాడుతూ 18ఏళ్ళు పూర్తయిన ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కొట్టే వెంకటేశ్వర్లు, కార్యదర్శి యన్.సతీష్‌కుమార్, వై.సాయి, సుధీర్ రామ్‌చరణ్, శివ, రక్తనిధి చీఫ్ టెక్నాలజిస్ట్ జీవన్ సిబ్బంది పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్‌లో స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్ ఉద్యమంలో భాగంగా 3వతేదీ రెడ్‌క్రాస్ రోడ్డును ఆక్రమించుకుని ఉన్న బంకులు, పండ్ల బండ్లను నెల్లూరు జాయింట్ కలెక్టర్ రేఖారాణి సూచనల మేరకు పండ్ల మార్కెట్‌కు తరలించారని రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డా॥ఈదూరు సుధాకర్ తెలిపారు. ఆ ప్రాంతంలో మొక్కలు నాటే భాధ్యతను చిరంజీవి యువతకు జేసీ అప్పగించా రని తెలిపారు. జూబ్లీ హాస్పిటల్, రెడ్‌క్రాస్ రోడ్డులో సిహెచ్ అజయ్‌బాబు, డా॥ యస్.సాయి నాథ్ రక్తనిధి సిబ్బంది, మునిసిపల్ కార్మికులు, మెప్మా సభ్యులు శ్రమదానం చేసారు. జేసీ రేఖారాణి, మునిసిపల్ ఇంజినీర్ సంపత్‌కుమార్, జూబ్లీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥తిరుపాలు పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.



# పరిశుభ్రత పాటించండి.. ప్రగతికి కృషి చేయండి

**- స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో నేతల ఉద్ఘాటన**

మనం నివసించే అన్ని ప్రాంతాలూ పరిశుభ్రంగా వుండాలని, ప్రతివ్యక్తి పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అందరూ పారిశుద్ధ్య పరిరక్షణకు పాటు పడాలని, దేశాన్ని పరిశుభ్రంగా, స్వచ్ఛ భారత్‌గా తీర్చిదిద్దుకోవాలని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు అన్నారు.

ఈ నెల 5న నెల్లూరులో రాష్ట్ర మంత్రి పి.నారాయణతో కలసి ఆయన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఒక రోజు అని కాకుండా నిరంతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. పరిసరాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ నడుము బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ వెంకయ్యనాయుడు సహకారంతో నెల్లూరును దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు. ఎవరూ చెత్తను రోడ్లపై వేయవద్దని, డస్ట్‌బిన్‌లలో వుంచుకుని కార్పొరేషన్ వాహనాల్లో ఆ చెత్తను వేయాలని మంత్రి సూచించారు. వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు మాట్లాడుతూ, రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు తమవంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా నగరంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించి పారిశుద్ధ్య పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. మంత్రులు, నాయకులు, అధికారులు అందరూ కలసి పలుచోట్ల చెత్తను, మురికిని శుభ్రం చేశారు.



చీపురు పట్టిన కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు

ఈ కార్యక్రమంలో మాజీమంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తాళ్ళపాక రమేష్‌రెడ్డి, నెల్లూరునగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, మేయర్ అబ్దుల్ అజీజ్, జిల్లా కలెక్టర్ శ్రీకాంత్, జిల్లా ఎస్పీ సెంథిల్‌కుమార్, జేసి రేఖారాణి, కార్పొరేషన్ కమిషనర్ చక్రధర్‌బాబు, డిప్యూటి మేయర్ ద్వారకానాథ్, టిడిపి నాయకులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తాళ్లపాక అనూరాధ, కిలారి వెంకట స్వామినాయుడు, బిజెపి నాయకులు సురేష్‌రెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబువన్నీ మోసపూరిత వాగ్దానాలే!

**వైకాపా కార్యాలయ ప్రారంభోత్సవంలో నల్లపరెడ్డి ప్రసన్న విమర్శ**



టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ఎన్నికల్లో గెలిచేందుకు మోసపూరిత వాగ్దానాలు చేసి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని, నెరవేర్చలేని హామీలు ఇచ్చి ప్రజలకు ద్రోహం చేశారని వైఎస్సార్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. ఈ నెల 4వ తేదిన నెల్లూరు నగరంలోని మాగుంట లేఅవుట్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మభ్యపెట్టినందుకు చంద్రబాబునాయుడుపై ఎన్నికల కమిషన్ తగు చర్యలు తీసుకోవాలన్నారు. టిడిపి గుర్తింపును రద్దు చేయాలని ఆయన కోరారు. టిడిపి నాయకులు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేదంటే ప్రజల పక్షాన ఉద్యమించేందుకు వైఎస్సార్సీపి సిద్ధంగా వుందన్నారు. జిల్లాలో వైఎస్సార్సీపిని బలోపేతం చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని ప్రసన్న ఈ సందర్భంగా అన్నారు. పార్టీ అనుబంధ సంస్థలను కూడా త్వరితగతిన మరింత పటిష్టం చేస్తున్నామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే వైఎస్సార్సీపి ధ్యేయమని, తమ నాయకుడు జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో, పార్టీలోని ఎంపిలు, ఎమ్మెల్యేలు, నాయకులు అందరినీ కలుపుకుని ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి కేంద్ర పాలకమండలి సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సిఇసి సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాయకులు రూప్‌కుమార్‌యాదవ్, బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, బండ్లమూడి అనిత, దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, కె. బాలశంకరరెడ్డి, సత్యనారాయణరెడ్డి, భాస్కరరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వెంకయ్య చొరవతోనే...

# నెల్లూరుకు ఐఏఎస్ కమిషనర్

నెల్లూరు నగర పాలకసంస్థకు ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా వేయడం వెనుక కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు చొరవతీసుకున్నట్లు కనిపిస్తోంది. కేవలం ఆయన గట్టిగా చెప్పడంతోనే మున్సిపల్ మంత్రి నారాయణ నెల్లూరు కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి చక్రధర్‌ను నియమించారు. అయితే ఈ దిశగా వెంకయ్యనాయుడు మీద ఒత్తిడి తెచ్చింది నెల్లూరు గ్రామీణఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డే! నెల్లూరు నగరపాలక సంస్థలో పరిస్థితులు బాగా లేవు. సాధారణ కమిషనర్లు వస్తే పాలకవర్గం ఇలాగే రెచ్చిపోతుంటుంది. కార్పొరేషన్‌లో ఒక్క పని కూడా జరగదు. ఇంతకుముందే ఎన్నో అవినీతి అక్రమాలు జరిగివున్నాయి. అవి ఇంకా కొనసాగుతున్నాయి. కార్పొరేషన్‌లోనూ గ్రూపు రాజకీయాలు, ఆధిపత్యపోరు ఎక్కువవుతోంది. అందరూ అధికారం చెలాయించాలని చూస్తారు. అభివృద్ధి పక్కనపడి వీళ్ళు తన్నుకోవడానికి సరిపోతుంది. ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా వేస్తే అన్నీ సర్దుకుంటాయి. నెల్లూరు నగరం గాడిలో పడుతుందని వెంకయ్యకు కోటంరెడ్డి విన్నవించుకున్నాడు. దీంతో వెంటనే వెంకయ్యనాయుడు మంత్రి నారాయణకు ఫోన్ చేశాడు. నారాయణ నెల్లూరుకు ఐఏఎస్ ఆఫీసర్‌నే కమిషనర్‌గా వేయాలి, అప్పటిదాకా ఇప్పుడున్న కమిషనర్‌నే ఉంచు అని చెప్పాడు. వెంకయ్య ఫోన్ చేసే సమయానికే నెల్లూరుకు కొత్త కమిషనర్‌గా ఓబులేసును ఖరారు చేశారు. వెంకయ్య ఫోన్‌తో సీన్ రివర్స్ అయ్యింది. వెంటనే ఓబులేసును ఆపేసారు. ఐఏఎస్ అధికారులలో ఉన్నవారిని పరిశీలించి చక్రధర్‌ను నెల్లూరుకు ఎంపిక చేశారు.

# అరుదైన పోర్టుల్లో ఒకటిగా కృష్ణపట్నం

**- పోర్టు ఎం.డి చింతా శశిధర్**



కంటైనర్ షిప్‌ను ప్రారంభిస్తున్న కెప్టెన్ ఎస్.నరుల్లా



ప్రపంచంలోనే కృష్ణపట్నంపోర్టు అరుదైన పోర్టుగా రూపుదిద్దుకుంటుందని కృష్ణపట్నం పోర్టు కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చింతా శశిధర్ పేర్కొన్నారు. ఈ నెల 3వ తేదీన దసరా పండుగనాడు కృష్ణపట్నం పోర్టు నుండి మయన్మార్‌లోని యాంగాన్‌పోర్టుకు కంటైనర్‌షిప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పోర్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో ఈ పోర్టును ప్రపంచంలోనే అత్యంత ప్రాధాన్యతగల పోర్టుగా తీర్చిదిద్దుతామన్నారు. రాబోయే 5ఏళ్లలో మూడువేల కోట్ల ఆదాయం లక్ష్యంగా పోర్టు కార్యకలాపాలను విస్తృతం చేస్తున్నామన్నారు. గత ఏడాది 1200కోట్ల ఆదాయాన్ని లక్ష్యంగా పెట్టుకుని అధిగమించామన్నారు. ఈ ఏడాది 1800కోట్ల ఆదాయాన్ని టార్గెట్ చేసామన్నారు. దేశంలోని ప్రైవేట్ పోర్టుల్లో కృష్ణపట్నం పెద్దది. ఎగుమతులు, దిగుమతులకు ఇక్కడ ఎంతో అనువుగా ఉంటుంది. పోర్టులో ఉన్న సమస్యలను గుర్తించి అన్నింటిని సరిచేశాం. ఇప్పుడు పోర్టులో అన్ని మౌలిక వసతులున్నాయి. ఎగుమతి, దిగుమతిపరంగా వ్యాపారులకు ఇక్కడ అత్యంత సౌకర్యంగా వుందని చెప్పారు. ఒకే సమయంలో 10 నౌకలు లంగరు వేసేలా 11బెర్తులను నిర్మించామని, రానున్న 5ఏళ్లలో 42బెర్తులను పూర్తిచేసి ఒకేసారి 40నౌకలు లంగరు వేసేలా పోర్టును అంతర్జాతీయ స్థాయిలో పెద్దదిగా చేస్తామన్నారు. జిల్లాలో దుగరాజపట్నం వద్ద మరో పోర్టు వచ్చినా తమ పోర్టుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఆయన విలేకరులడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పోర్టులో కేవలం వ్యాపార కార్యకలాపాలే కాకుండా సివిఆర్ ఫౌండేషన్ ద్వారా 130కోట్ల రూపాయలతో సేవా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. భారతదేశంలో ఏ పోర్టుకు కూడా సొంత రైల్వేలేదని, కృష్ణపట్నం పోర్టు మాత్రమే సొంత రైల్వేలైన్‌ను కలిగి, రైల్వేశాఖకు ఏటా 130కోట్ల ఆదాయాన్ని సమకూరుస్తుందన్నారు. ఈ సమావేశంలో షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎస్.నరుల్లా కూడా పాల్గొన్నారు. అంతకుముందు సివిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్పొరేట్‌వసతులతో ఏర్పాటు చేసిన దంత వైద్యశాలను ముంబైకి చెందిన ప్రఖ్యాత దంతవైద్యులు డాక్టర్ సందేష్ మయేకర్ ప్రారంభించారు. అలాగే కృష్ణపట్నంపోర్టు సెక్యూరిటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో జరిగిన డాగ్ విన్యాసాలు, సెక్యూరిటీ సాహస ప్రదర్శనలు అలరించాయి.

# స్వచ్ఛభారత్‌లో ఆర్ఎంఎస్



భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు స్వచ్ఛభారత్ కార్యక్రమం నెల్లూరు ఆర్ఎంఎస్(రైల్వే మెయిల్ సర్వీస్) కార్యాలయంలో ఈనెల4వతేదీ జరిగింది. ఈ కార్యక్రమంలో కర్నూలు డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీస్ డివియస్ ఆర్.మూర్తి అధ్యక్షతన "స్వచ్ఛభారత్" ప్రతిజ్ఞను కార్యాలయం సిబ్బంది చేత చేయించారు. అనంతరం కార్యాలయం పరిసర ప్రాంతాల్లో శుభ్రం చేయించి, పూలమొక్కలు నాటించారు. ఈ సందర్భంగా ప్రతిఒక్కరు వారానికి రెండు గంటలు, సంవత్సరానికి 100గంటలు చొప్పున పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపడుతామన్నారు. ఈమేరకు డైరెక్టర్ఆఫ్ పోస్టల్‌సర్వీస్ మూర్తి పరిశుభ్రతయే దైవత్వం అని సందేశాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఎస్ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణా, సబ్‌రికార్డ్ ఆఫీసర్ టి.భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.



## పెళ్ళంటే మంట

ఈమధ్య హీరోయిన్ అనుష్క పెళ్లి మాట వింటే తెగ మండిపోతోంది. దీనికి కారణం... త్వరలో ఆమె పెళ్లని పుకార్లు రావడమే. దక్షిణాదిలో 'బాహుబలి', 'రుద్రమదేవి', 'లింగా' వంటి భారీ చిత్రాల్లో నటిస్తున్న అనుష్క చాలా బిజీగా ఉంది. అయితే తనకు సంబంధం లేకుండా తన పెళ్లిపై రూమర్స్ రావడంతో తెగ బాధపడిపోతోంది.

## మూ 'వీ' క్షణం




## ఉత్తమ మొగుడు

ఈమధ్య 'కర్వాచౌత్' ఛాలెంజ్‌లను ఒకరిపై ఒకరు విసురుకుంటున్న సంగతి తెలిసిందే! కర్వాచౌత్ అంటే దీపావళికి ముందు 9రోజులు మహిళలు తమ భర్త, పిల్లలు బాగుండాలని ఉపవాసం ఉంటారు. అయితే ఈ కర్వాచౌత్ రోజున తెలుగు హీరో నాని కూడా ఉపవాసానికి సిద్ధమయ్యాడట!



## 'చిరుత'కు 'బన్నీ' బ్రేక్

రామ్‌చరణ్ హీరోగా నటించిన 'గోవిందుడు అందరివాడేలే' సినిమా ఫ్లాప్‌గా టాక్ వచ్చింది. దసరా సెలవులు ముగియడంతో తెలంగాణ, ఆంధ్రాల్లో ఈ సినిమా కలెక్షన్స్ ఒక్కసారిగా పడిపోయాయి. దీంతో 2014కు బ్లాక్‌బస్టర్ అనుకున్న ఈ మూవీ ఆ రికార్డును అందుకోలేకపోయింది. కలెక్షన్లలో అల్లు అర్జున్ 'రేసుగుర్రం' 2014కు బిగ్గెస్ట్ హిట్ చిత్రంగా నిలిచిపోతుందని విశ్లేషకుల అంచనా.

## గూడూరు డివిజన్ వార్తలు

# ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛభారత్



శ్రమదానం చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రక్కన ఎల్లసిరి గోపాల్‌రెడ్డి

గూడూరు ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఈ నెల 2వ తేదీ చెత్తను తొలగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకెళ్ళాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రధాని మోడీ స్వచ్ఛభారత్‌ను మంచి ఆశయంతో చేపట్టారన్నారు. ఎన్టీఆర్ సుజలధార పథకానికి ప్రభుత్వం ప్రత్యేక గ్రాంటు కేటాయించాలన్నారు. ప్రధాని ఇచ్చిన పిలుపుమేరకు వైసీపీ స్పందించి పట్టణంలో పారిశుధ్యానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర నేత ఎల్లసిరి గోపాలరెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాకాటి అశోక్‌కుమార్, వైసిపి పట్టణ అధ్యక్షుడు నాశిన నాగులు, కౌన్సిలర్ వాటంబేడు శివకుమార్, దందు మహేష్‌రెడ్డి, ఇస్రాయిల్ కుమార్, చోళవరం గిరిబాబు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



### మద్యం గొలుసు దుకాణాలపై

# ఎక్సైజ్ సిఐ రత్నం దాడులు

చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో నిర్వహిస్తున్న మద్యం గొలుసు దుకాణాలపై ఈ నెల 5వ తేదీ ఎక్సైజ్ సిఐ రత్నం ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. ఈ సందర్భంగా మద్యం విక్రయిస్తున్న వీరయ్య, ఆదినారాయణ, సాయి ప్రకాష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారివద్ద నుంచి 65క్వార్టర్లు, 16బీరు సీసాలను స్వాధీనం చేసుకొన్నారు. ఈమేరకు నిందితులను కోర్టుకు హాజరపరిచినట్లు ఆయన తెలిపారు.

# రూ. 2లకే 20లీటర్ల నీరు

### ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ప్రారంభించిన పొనకా దేవసేన



టవర్‌క్లాక్ కూడలి వద్ద పరిశుభ్రత ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, కమిషనర్ అనురాధ, తహశీల్దార్ వెంకటనారాయణమ్మ, ఎంపిడివో నిర్మలాదేవి, కౌన్సిలర్లు తదితరులు

గూడూరులో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం ద్వారా శుద్ధిచేసిన నీరు రూ. 2/-లకే 20లీటర్లు అందించనున్నట్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన ప్రకటించారు. "జన్మభూమి - మా ఊరు" కార్యక్రమంలో భాగంగా మాతమ్మ గుడి నుంచి ఆర్డీవో కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఆర్.అనురాధ, తహశీల్దార్ వెంకటనారాయణమ్మ, ఎంపీడీవో నిర్మలాదేవి, కౌన్సిలర్లతో కలిసి అవగాహన ర్యాలీ ప్రారంభించారు. టవర్ క్లాక్ కూడలి వద్ద పరిశుభ్రత ప్రతిజ్ఞ చేశారు. అనంతరం అశోక్‌నగర్ నీళ్ళ ట్యాంకు ఆవరణలో 3.50లక్షల వ్యయంతో రూపొందించిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన ప్రారంభించారు. అనంతరం ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ పరిధిలో 10 తాగునీటి ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అందుకు పలువురు దాతలు ముందుకు వచ్చారన్నారు.

ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, టీడీపీ నాయకులు పొనకా శివకుమార్‌రెడ్డి, చదలవాడ హరిప్రసాద్‌నాయుడు, బద్రిగిరి, మనపాటి రవీంద్రబాబు, బొమ్ము ప్రశాంత్, ముప్పాళ మురళీమోహన్‌రాజు, కౌన్సిలర్లు పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, బాలిపోయిన రమేష్, మాజీకౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# కటాలమ్మ అమ్మవారికి ఆభరణాల బహూకరణ



పూజారికి ఆభరణాలను అందిస్తున్న దాతలు

గూడూరు మండలంలోని చెన్నూరు-తిప్పవరప్పాడు గ్రామాల ఆరాధ్య దైవం కటాలమ్మకు ఈ నెల 3వ తేదీ అల్లూరు కరుణాకర్‌రెడ్డి, మండి శ్రీనివాసులురెడ్డి, అన్నం రఘురామయ్యలు సంయుక్తంగా అమ్మవారికి ఆభరణాలను బహూకరించారు. శాస్త్రోక్తంగా పూజలు చేసి ఆలయ పూజారికి పెద్ద దండ, రెండు హారాల మెటీరియల్ ఆభరణాలు అందజేశారు. అదేవిధంగా ఆలయాన్ని దసరా సందర్భంగా రంగురంగుల విద్యుద్దీపాలు, పూలతో ముస్తాబు చేశారు. అమ్మవారు ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయం కిటకిటలాడింది.

### సేవాగుణంతో పాటు

# స్నేహగుణం అలవర్చుకోవాలి

**- ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీనివాసరావు**

సేవాగుణంతో పాటు స్నేహ గుణం అలవర్చుకోవాలని ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని డిఆర్‌డబ్ల్యు కళాశాలలో ఆదివారం లయన్స్ క్లబ్ మొదటి రీజియన్‌లోని అన్ని క్లబ్‌ల అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారులు నిర్వహించాల్సిన బాధ్యతలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ చేయాల్సిన సేవలను వివరించారు.

ఈ కార్యక్రమంలో జోన్ ఛైర్మెన్ మల్లు విజయకుమార్‌రెడ్డి, రీజియన్ ఛైర్మెన్ ఆర్.వి.రావు, వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నపరెడ్డి, వైకాపా రాష్ట్రనేత ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, డాక్టర్ సి.ఆర్.రెడ్డి, వైజేపీ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు మంజులాదేవి, మురళీనాయుడు, లయన్స్ అధ్యక్షుడు సురేష్, మల్లిఖార్జునరావు, లయన్ పిఆర్వో కడివేటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### రెడ్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో

# అసహాయులకు ఫలసరకుల పంపిణీ



రూ.50,001/- చెక్కును ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేత అందజేస్తున్న దాత కోట సునీల్‌కుమార్

గూడూరు పట్టణంలోని త్యాగరాజ వీధి వద్దగల శ్రీకృష్ణ మందిరంలో రెడ్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యాన అసహాయులకు ఈనెల 5వతేదీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చేతుల మీదుగా ఫలసరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసహాయులకు చేయూతనందించేందుకు ఈ సంస్థ చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా కోట సునీల్‌కుమార్ వికలాంగుల సహాయార్థం రూ. 50,001/-లు చెక్కును సంస్థ ప్రతినిధులకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో అధ్యక్ష కోశాధికారులు జానా సుధీర్, రాజ్‌పురోహిత్ రాజేష్, రామలింగం, జమీల్, 14వ వార్డు కౌన్సిలర్ కల్పన, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా అమ్మవార్ల ఊరేగింపు

గూడూరులో అమ్మవార్ల ఊరేగింపు ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి అత్యంత వైభవంగా జరిగింది. విజయదశమి సందర్భంగా పట్టణంలోని సొసైటీ ప్రాంతంలో ఉన్న నారాయణమ్మ పేరంటాళ్లు, వలయానందపురంలో వెలసివున్న మహాలక్ష్మమ్మ, బజారువీధి ప్రాంతంలోని వాసవి కన్యకాపరమేశ్వరిదేవి, గ్రామశక్తి రాజావీధిలోని గంగమ్మ, హైస్కూల్‌రోడ్డులో మూలస్థానేశ్వర ఆలయంలో భువనేశ్వరీదేవి, పటేల్‌వీధిలోని సాయి సత్సంగ నిలయంలో విజయదుర్గాదేవి, మాలవ్యానగర్‌లోని మహాలక్ష్మమ్మ ఆలయాల్లో ప్రత్యేకపూజలు జరిగాయి. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి మేళతాళాలు, తప్పెట్లు, బాణాసంచా, బ్యాండుమేళం, విచిత్ర వేషధారణల మధ్య అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారు మహాత్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 10.10.2014 నుండి
తేది. 16.10.2014 వరకు

ఈ వారం మీనంలో కేతువు, మేష వృషభ కర్కాటకరాశులలో చంద్రుడు, కర్కాటకంలో గురువు, కన్యలో రవిశుక్ర రాహువులు, తులలో శనిబుధులు, వృశ్చికంలో కుజుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

శుక్రమౌఢ్యమి జరుగుచున్నది.
ముహూర్తములు లేవు.

**ఆశ్వయుజ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 10 | శుక్ర | విదియ | ప॥గం.1.30వ॥ |
| తేది. 11 | శని | తదియ | ప॥గం.12.27వ॥ |
| తేది. 12 | ఆది | చతుర్థి | ప॥గం.11.52వ॥ |
| తేది. 13 | సోమ | పంచమి | ప॥గం.11.49వ॥ |
| తేది. 14 | మంగళ | షష్ఠి | ప॥గం.12.15వ॥ |
| తేది. 15 | బుధ | సప్తమి | ప॥గం.1.12వ॥ |
| తేది. 16 | గురు | అష్టమి | ప॥గం.2.31వ॥ |

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆర్థిక ఇబ్బందులుండినా ఏదో ఒక రూపంలో సర్దుబాటు కాగలవు. వస్తు వాహన గృహ రిపేర్ల ఖర్చులుంటాయి. వాహనాల మీద ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. ప్రభుత్వ అనుమతులు, ఉద్యోగార్థులకు అవకాశాలు ఆలస్యం కాగలవు. వ్యవహారాలు, అగ్రిమెంట్ల విషయాలలో జాగ్రత్త అవసరం. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేయడం మంచిది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

చేపట్టిన పనులను పట్టుదలతో సాధించుకొంటారు. వ్యవహారాలలో తొందరపాటు పనులు, మాటలు లేకుండా జాగ్రత్తపడండి. వృత్తి వ్యాపారాలలో అవకాశాలు తగ్గుతాయి. సామాన్య ఆదాయానికి లోపం రాదు. ప్రభుత్వపరమైన పనులు, అనుమతులు మంజూరు కాగలవు. ఉద్యోగ బాధ్యతలలో మార్పులుంటాయి. ప్రముఖులను కలుసుకొనడం జరుగుతుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

మీ ఆర్థిక ప్రణాళిక, పథకాలు మేలు చేకూర్చగలవు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం సామాన్యం. పెట్టుబడులకు ఋణాలు చేస్తారు. అనుకున్న పనులు సొంతవి నిదానంగా సాగుతాయి. ఉద్యోగులకు భారం, వత్తిడి ఎక్కువగా ఉంటుంది. శుభకార్యాలు నిర్ణయం చేయడం జరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసికొనడం మంచిది. హామీలు ఇవ్వడం చేయవద్దు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ముఖ్యవ్యవహారాలలో సరైన నిర్ణయాలు జరుగుతాయి. ఏ విషయాన్ని తీవ్రంగా పరిగణించక మీ పద్ధతిలో ముందుకు సాగండి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఇంటికి వసతులు ఏర్పరచుకొనడం, విలువైన వస్తువులు కొనడం, స్థిరాస్తుల క్రయవిక్రయ ఆలోచనలుంటాయి. సాంకేతిక రంగాలలో ఉద్యోగావకాశాలుంటాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఆర్థిక వ్యవహారాలు, వ్యాపారాలను జాగ్రత్తగా నడుపుతారు. ఆదాయం పెరుగుతుంది. అనుకోని కొన్ని అదనపు ఖర్చులు పైనబడతాయి. పిల్లల విద్య, వివాహ విషయాలపై దృష్టి పెడతారు. వృత్తి ఉపాధి పథకాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. ఋణాలు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలలో కొంత అనుకూలత ఉంది. ప్రముఖులతో కొత్త వారితో పరిచయాలుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

పన్నులు, చెల్లింపులు జరుపుతారు. ఆర్థికంగా అభివృద్ధి ఉంటుంది. ఆదాయం స్వల్పంగా పెరిగినను, అదనపు ఖర్చుల భారం తప్పదు. ముఖ్యమైన పనులు వాయిదా పడి టెన్షన్ కలిగిస్తాయి. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యం జరుగుతుంది. కుటుంబంలో సర్దుబాటుతనం తగ్గుతుంది. రావలసిన బాకీలు కొంతమేరకు అందుతాయి. కోర్టు కేసులలో కొంత ఊరట ఉంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

పిల్లల విద్యా వివాహ విషయాలలో శ్రద్ధ చూపుతారు. చేపట్టిన పనులలో ఆటంకాలు, ఆలస్యం ఎదురైనా పట్టుదలతో సాధించుతారు. వృత్తి, ఉపాధి వ్యాపార రంగాల వారికి అభివృద్ధి బాగుండి రాబడి పెరుగుతుంది. కొత్త పెట్టుబడులకు అవకాశాలుంటాయి. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. ఉద్యోగులకు పనిభారం ఎక్కువ. మాటలు, చేష్టలలో తొందరపాటు తగ్గించుకొనండి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

చేపట్టిన పనిని ఏదో ఒక విధంగా పూర్తి చేస్తారు. వ్యాపారవర్గాల వారు ఆటంకాలను అధిగమించి, కొత్త ప్రణాళికలతో అభివృద్ధి వైపు ప్రయత్నిస్తారు. ఆదాయం పెరుగుతుంది. రావలసిన బాకీలు కొంతవరకు లభిస్తాయి. పెద్దల పరిచయాలకై వేచివుండవలసి వస్తుంది. తొందరపాటు నిర్ణయాలు చేయవద్దు. వర్కర్లతో సమస్యలు రావచ్చును. విలువైన వస్తువులు జాగ్రత్త పరచుకొనండి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేయడం మంచిది. వృత్తి ఉపాధి పథకాలు ఆశాజనకంగా సాగుతాయి. వ్యాపారవర్గాలకు కొత్త అవకాశాలు, కొత్త పెట్టుబడులు లభించగలవు. ఆదాయం తృప్తి కరంగా ఉండినా కొన్ని ముఖ్య అవసరాలకు ఋణం చేయవలసి వస్తుంది. కార్య వ్యవహారాలను ఇతరుల మీద పెట్టకుండా మీరే పర్యవేక్షించడం మంచిది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆర్థిక లావాదేవీలు, ఒప్పందాలలో శ్రద్ధ చూపుతారు. ఖర్చులు ఆదాయం సంతృప్తికరంగా సాగుతాయి. అనుకున్న పనులను శ్రద్ధతో పూర్తి చేస్తారు. రావలసిన బాకీలు, కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉన్నది. ఇతరులకు సహాయం చేయుటకు నిర్ణయం తీసికొంటారు. షేర్లు, స్థిరాస్తులపై లాభాలుంటాయి. సంతోషకరమైన వార్తలు వింటారు. విలువైన వస్తువులు కొంటారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థికాభివృద్ధికి పథకాలు, కొత్త ఆర్థిక ప్రణాళికలు కార్యరూపం దాలుస్తాయి. ఆదాయం సామాన్యం. ఖర్చులు పెరిగి దాచుకున్న డబ్బును గాని, ఋణాలు చేసి గాని ఉపయోగిస్తారు. కుటుంబంలో అనారోగ్య బాధలుంటాయి. ఇంటి రిపేర్లు, వస్తువాహన రిపేర్లుంటాయి. వ్యాపారాలలో మంచి అవకాశాలు చేజారిపోవచ్చును. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. కుటుంబంలో మీకు అనుకూలత తక్కువ.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అనవసర విషయాలపై ఆలోచన పెరిగి టెన్షన్ పడుతుంటారు. ఆరోగ్య విషయంలో శ్రద్ధ తీసికొనవలసి ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులు లేకపోయినా, అవసరాలకు డబ్బు చేతిలో ఉండదు. తరువాత ఏదో విధంగా సర్దుబాటు అవుతుంది. వృత్తివ్యాపారాలలో స్తబ్దత నెలకొంటుంది. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. ఆత్మీయులను కలుసుకొంటారు.

# విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

**భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విద్యుత్ మిగులు రాష్ట్రంగా, కోతలు లేని రాష్ట్రంగా తయారు చేయడానికి తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతాపార్టీలు కృత నిశ్చయంతో ఉన్నాయని భారతీయజనతాపార్టీ అధ్యక్షుడు, విశాఖపట్నం పార్లమెంట్ సభ్యుడు కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. నెల్లూరు నగరం రామ్మూర్తినగర్‌లోని బిజెపిపార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో హరిబాబు పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే ప్రతిష్టాత్మకమైన కేంద్రీయ విద్యా సంస్థలను, విశాఖపట్నం, అజ్మీర్, అలహాబాద్ నగరాలను సుందరనందన నగరాలుగా తీర్చిదిద్దేందుకు ఒప్పందం కుదిరిందన్నారు. విజయవాడ నుండి చెన్నై వరకు బకింగ్‌హామ్ కెనాల్ గుండా పడవల్లో సరుకులు రవాణా చేసేలా జాతీయ జల రవాణా మార్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి నెల్లూరుజిల్లా అధ్యక్షులు పి.సురేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కాకు విజయలక్ష్మి రాష్ట్ర చేనేత సెల్ కన్వీనర్ కెఎస్.చక్రధారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగినేని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల ఆశ్రమానికి వితరణ

నెల్లూరు, బాలాజీనగర్‌లోని గీతామయి ఉచిత వృద్ధుల ఆశ్రమానికి నెల్లూరుజిల్లా వాకర్స్ అసోసియేషన్, నేతాజీ(ఎంఎస్‌ఆర్) పైలట్ స్కూల్ కరస్పాండెంట్ యం.సుబ్బారెడ్డి పదివేల రూపాయలు విలువచేసే వాషింగ్‌మిషన్‌ను అందజేసినట్లు ఆశ్రమ నిర్వాహకులు తమ్మినేని పాండు, సరళ తెలిపారు. సుబ్బారెడ్డి తండ్రి వర్ధంతిని పురస్కరించుకుని ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేయడం జరిగిందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో బి.వి.నరసింహం, శింగంశెట్టి మురళీమోహన్‌రావు, ఏ.ప్రదీప్, ప్రసాద్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

# జ్ఞానప్రసూనాంబ నర్సింగ్ కాలేజీకి దిక్కెవరు?




దక్షిణకాశిగా, రాహు–కేతు క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీకాళహస్తీశ్వరాలయంకు అనుబంధంగా ఉన్న జ్ఞానప్రసూనాంబ నర్సింగ్ స్కూల్ సిబ్బంది కష్టాలు తల్లీ జ్ఞానప్రసూనాంబికే ఎరుక. ఏడాదిలో ఆలయానికి రూ. 100 కోట్ల రూపాయల ఆదాయం వస్తుంది. దీంతో 1997లో ఆలయానికి అనుబంధంగా శ్రీకాళహస్తీశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (స్కిట్ ) ఇంజనీరింగ్ కళాశాలను, 2003లో జ్ఞానప్రసూనాంబ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేశారు. స్కిట్ కళాశాలకు 50ఎకరాల స్థలంలో అవసరమైన మేరకు స్వంత భవనాలు ఉన్నప్పటికి నర్సింగ్ కళాశాల ప్రారంభం నుంచి ఈటీసీ ట్రైనింగ్ సెంటర్‌కు చెందిన అద్దె భవనాల్లోనే 11 ఏళ్లుగా నడుస్తోంది. నెలకు రూ.15వేలు అద్దె చెల్లిస్తున్నారు. మొదట నాలుగేళ్లు సజావుగానే సాగింది. ఆ తర్వాత కష్టాలు ప్రారంభమైనాయి.

***నర్సింగ్ కళాశాలకు ఆర్థిక కష్టాలు***

విద్యార్థులకు నర్సింగ్ కోర్సును మూడున్నరేళ్ళలో పూర్తి చేయాల్సి ఉంది. కాగా ఏడాదికి 30 సీట్లు చొప్పున మూడేళ్లకు 90 సీట్లు మాత్రమే ఉన్నాయి. అయితే 60శాతం సీట్లు స్కాలర్‌షిప్ ద్వారా ( వెల్ఫేర్ అసోసియేషన్ వారు ఫీజులు చెల్లిస్తారు ). 40 శాతం సీట్లు మాత్రమే మేనేజ్‌మెంట్ కోటా ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. వీరంతా ఏడాదికి రూ.14వేలు చెల్లించాల్సిఉంది. అయితే ఏడేళ్లుగా 70సీట్లు మాత్రమే భర్తీ అవుతున్నాయి. 20సీట్లు ఖాళీగానే ఉంటున్నాయి. ఇక భర్తీ చేసిన వారిలో 20 మంది మాత్రమే మేనేజ్‌మెంట్ కోటా వాళ్లు. మిగిలిన వారికి ఫీజులు వెల్ఫేర్ అసోసియేషన్ వారే చెల్లించాల్సి ఉంది. వారు సుమారు 10 లక్షలు వరకు స్కాలర్‌షీప్ ఫీజులు చెల్లించకపోవడంతో నర్సింగ్ కళాశాలకు కష్టాలు తప్పలేదు. దీంతో నర్సింగ్ కళాశాల యాజమాన్యం ఈటీసీ ట్రైనింగ్ సెంటర్ వాళ్ళకు రూ.10 లక్షలు అద్దెలు చెల్లించలేదు. దీంతో వారు వెంటనే నర్సింగ్ కళాశాలను ఖాళీ చేయండి లేదా? అద్దెలు చెల్లించండి అంటూ ఒత్తిళ్లు చేస్తుండడంతో నర్సింగ్ కళాశాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మరోవైపు సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు.

***మంత్రి మాటలు నీటి మూటలేనా?***

నర్సింగ్ కళాశాల సిబ్బంది ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డికి తమ కష్టాలను మొరపెట్టుకోవడంతో ఆయన 40 రోజుల క్రితం కళాశాలను పరిశీలించారు. రూ.10 లక్షలు శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి వెంటనే జీతాల అందిస్తామని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న రూ.10లక్షలు స్కాలర్ షిప్‌లు వెల్ఫేర్ అసోసియేషన్ వారి నుంచి ఇప్పిస్తామని చెప్పారు. అంతేకాదు శిథిలమైన ఈటీసీ ట్రైనింగ్ సెంటర్ అద్దె భవనాల్లో కాకుండా నర్సింగ్ కళాశాలను స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్న మిగుల భవనాల్లోకి మార్పు చేయిస్తామని హామీ ఇచ్చారు. దీంతో కళాశాల సిబ్బంది తమ కష్టాలు తీరనున్నాయని సంతోషం వ్యక్తం చేశారు.

**కమిషనర్ అనుమతి కావాలి - ఇ.ఓ**

ఆలయానికి అనుబంధంగా ఉన్న జ్ఞానప్రసూనాంబ నర్సింగ్ కళాశాలకు రూ.10లక్షలు నోటి మాటల ద్వారా ఇవ్వలేం. అయినా కళాశాలకు ఆలయం డబ్బులు ఎక్కడా ఇచ్చిన దాఖలాలు లేవు. ఒకవేళ దేవాదాయ శాఖ కమిషనర్ నుంచి ప్రతిపాదనలు వస్తే కళాశాలకు డబ్బులు ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరం లేదని కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నట్లు సమాచారం. ఇక నర్సింగ్ కళాశాలను స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు మార్పు చేయాలని మంత్రి సూచించారు. పలు నూతన భవనాలు నిర్మిస్తున్నారు. అవి పూర్తి చేసిన తర్వాత కమిషనర్ అనుమతి ఇస్తే బదిలీ చేస్తామని కార్యనిర్వహణాధికారి అన్నట్లు తెలిసింది.

***కాలేజీ కష్టాల్లో ఉంది - ప్రిన్సిపల్***

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న జ్ఞానప్రసూనాంబ కళాశాల కష్టాల్లో ఉంది. ఓ వైపు కళాశాల భవనాలకు రూ.10 లక్షలు అద్దెలు చెల్లించలేక, సిబ్బందికి మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. మంత్రి హామీ మేరకు శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి రూ.10 లక్షలు వస్తోందని, మరోవైపు కళాశాలను స్కిట్ ఇంజనీరింగ్‌లోకి మార్పు చేస్తారని ఎదురుచూస్తున్నాం.



ఈ నెల 8న నెల్లూరులో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్‌ను కలిసి దగదర్తి గ్రామంలో ఎస్సీ ఎస్టీల ఇళ్ళ స్థలాలు తెలుగుదేశం నాయకులు కబ్జా చేసిన విషయమై చర్చిస్తున్న కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

## కావలిలో 11న శ్రీ జగన్నాథ రథయాత్ర

ఈ నెల 11వ తేదీన ఇస్కాన్ ఆధ్వర్యంలో కావలిలో వైభవోపేతంగా శ్రీ జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తామని, భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి శ్రీ జగన్నాథుని దర్శించుకుని తరించాలని ఇస్కాన్-నెల్లూరు అధ్యక్షులు శుకదేవస్వామి కోరారు. ఈ నెల 11న మధ్యాహ్నం 3 గంటలకు కావలిలోని బృందావనం కాలనీ నుంచి శ్రీ జగన్నాథుని రథయాత్ర ప్రారంభం అవుతుందని, అక్కడినుంచి ట్రంకురోడ్డు, 5 లాంతర్ల సెంటర్, కృష్ణుడి బొమ్మ కూడలి, పాతూరు శివాలయం ప్రాంతాల మీదుగా ఆర్ఎస్ఆర్ కళ్యాణ మండపం చేరుకుంటుందన్నారు. ఈ యాత్ర సందర్భంగా శ్రీ జగన్నాథునికి మహా ఆరతి, ఛప్పన్‌భోగ్ నిర్వహిస్తారని, ప్రముఖ ఆధ్యాత్మికవేత్తల ప్రసంగాలు, సందేశాలు వుంటాయని, రాత్రి 7గంటలకు భరతనాట్య ప్రదర్శనలు, గాన కచేరీ, ఇస్కాన్‌స్వాములు, ముఖ్యఅతిథుల సందేశాలు, ముఖ్యదాతల, సేవకుల సన్మానం వుంటాయని, అనంతరం శ్రీ జగన్నాథ దీప ఆరతుల ఉత్సవం, రాత్రి 8.30 గంటలకు అన్నప్రసాద వినియోగం వుంటుందని తెలిపారు. శ్రీ జగన్నాథుని దివ్యరూపాన్ని సందర్శించుకుంటే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, భక్తులు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని శ్రీ జగన్నాథుని దర్శించుకోవాలని ఆయన కోరారు.

## ఇసుకపాళెంలో గాంధీ జయంతి



గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2వ తేదీన వెంకటాచలం మండలంలోని ఇసుకపాళెంలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పెళ్ళూరు కామేశ్వరమ్మ సులోచనమ్మ స్మారక ట్రస్టీవారి ఆర్థిక సహకారంతో, వారి పర్యవేక్షణలో జడ్పీ వాకర్స్ అసోసియేషన్‌వారు మండల పరిధిలోని 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు పద్య పఠనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు నగదు బహుమతులను ట్రస్ట్ అధ్యక్షులు పెళ్ళూరు వెంకట్రామిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. న్యాయనిర్ణేతలుగా పాల్గొన్న జడ్పీ వాకర్స్ సంఘం ఉపాధ్యాయులకు, ఇతర తెలుగు పండితులకు కండువాలను కప్పి జ్ఞాపికలతో సత్కరించారు. సుమారు 3వందల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి సుమారు లక్ష రూపాయలు వెచ్చించిన పెళ్ళూరు కామేశ్వరమ్మ, సులోచనమ్మ సేవాట్రస్ట్‌వారికి ఈ సందర్భంగా జడ్పీ వాకర్స్ సంఘంవారు ధన్యవాదాలు తెలిపారు. జడ్పీ వాకర్స్ సంఘం అధ్యక్షులు చెలంచర్ల భాస్కరరెడ్డి, కార్యదర్శి మండువ శ్రీనివాసరావు, గౌరవ సలహాదారు బిరుదవోలు రామిరెడ్డి, ఆలూరి శిరోమణి శర్మ, టివి రమణయ్య, ఆంజనేయులు, అల్లూరు రాజు తదితరులతో పాటు, జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్‌బ్యాంక్ మాజీ ప్రెసిడెంట్ శ్యామసుందర్‌రెడ్డి, భాస్కరరెడ్డి, రామిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహిస్తూ ప్రసంగించారు.

## ఇస్కాన్‌సిటీ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం



నెల్లూరులో ఇస్కాన్‌సిటీ వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఇటీవల ఏర్పాటైంది. ఎం.రామకృష్ణం రాజు అధ్యక్షులుగా, ఎ.వెంకయ్య ఉపాధ్యక్షునిగా, బి.సుధాకరరావు కార్యదర్శిగా, వి.మల్లికార్జునరావు జాయింట్ సెక్రటరీగా, బి.రాజేష్‌రెడ్డి కోశాధికారిగా, టి.భాస్కరనాయుడు జాలీవాకర్‌గా ఎంపికయ్యారు. కె.సురేష్‌రెడ్డి, బివిఎస్ ప్రసాద్, ఎల్.వెంకటరత్నం, ఎం.గిరిప్రసాద్, వి. సుబ్బారెడ్డి, ఆర్ రాజేంద్రరెడ్డి, సి.పద్మనాభచౌదరి, సిహెచ్ వెంకటనారాయణ, జి.వివేకానందరాజు, వి.వెంకటయాదవ్ తదితరులు సభ్యులుగా నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వాకర్స్ ఇంటర్నేషనల్ కేబినెట్ సెక్రటరీ ఎం.విరెడ్డి, ఎంవి సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎ.రామకృష్ణంరాజు మాట్లాడుతూ ప్రధాని పిలుపుమేరకు స్వచ్ఛ భారత్ కార్యక్రమం తమ ప్రాంతంలోనూ నిర్వహిస్తామని, మొక్కలు పెంపకం చేస్తామన్నారు.

## రాజరాజేశ్వరి అమ్మవారికి పెరిగిన ఆదాయం

నెల్లూరు నగరం దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మ వారి దేవస్థానానికి శరన్నవ రాత్రి బ్రహ్మోత్సవాల్లో రూ39,93,204లు ఆదాయం లభించిందని ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం దేవస్థానంలో హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. హుండీల ద్వారా రూ15,29,132లు టిక్కెట్లు తదితర ఆదాయం ద్వారా రూ24,64,072లు మొత్తం రూ.39,93,204లు లభించిందన్నారు.

## డిఎస్పీల బదిలీ

రాష్ట్ర వ్యాప్తంగా 19 మంది డిఎస్పీలను బదిలీచేస్తూ డిజిపి జేవీ రాముడు మంగళవారం ఉత్తర్వులు జారీచేసినట్లు సమాచారం. నెల్లూరుజిల్లా గూడూరు డిఎస్పీ కె.చౌడేశ్వరి హైదరాబాద్‌లోని పోలీసు కంప్యూటర్ సర్వీసెస్‌కు బదిలీ కాగా, చౌడేశ్వరి స్థానంలో చిత్తూరు జిల్లా రేణిగుంట డిఎస్పీ బి.శ్రీనివాసులు నియమితులయ్యారు. ఆత్మకూరు డిఎస్పీగా డి.మోహన్‌రావును నియమించినట్లు తెలిసింది. గతంలో నెల్లూరు డిటిసి డిఎస్పీగా పనిచేసిన మోహన్‌రావు హైదరాబాద్‌లో సిఐడి విభాగంలో ఉన్నారు.

## రాజధాని కోటలు

(మొదటిపేజీ తరువాయి)

అసంభవం. తమ ప్రాంతంలో రాజధాని వస్తుందంటే రైతులు సంతోషిస్తారు. తమ భూముల రేట్లకు రెక్కలొస్తాయని ఆశపడతారు. అంతేగాని రాజధాని కోసం మీ భూముల్ని తీసుకుంటామంటే ఇస్తారా? కృష్ణా, గుంటూరు జిల్లాల్లో ఇప్పుడు అదే జరుగుతుంది. రాజధానికి కావాల్సిన భూమిని సేకరించాలా? లేక 60:40 పద్ధతిలో సమీకరించాలా? అనేదానిపై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. ఈ రెండింటిలో ఏది జరిగినా ఇక్కడ రైతుకే నష్టం. ఎందుకంటే రాజధాని ప్రకటన రాకముందే ఇక్కడ భూముల ధర ఎకరా కోట్లలోకి వెళ్ళింది. రాజధాని ఇక్కడే అన్నాక భూముల రేట్లు నాలుగింతలు పెరిగాయి. ప్రభుత్వం భూసేకరణ చేసి నష్టపరిహారం ఇచ్చినా లేక ల్యాండ్‌పూలింగ్ క్రింద అభివృద్ధి చేసిన భూమిని 40శాతం వరకు ఇచ్చినా రైతుకు పెద్దగా వచ్చేదేమీ వుండదు. రైతు తన పొలాన్ని తాను వ్యక్తిగతంగా అమ్ముకుంటేనే ఎక్కువ ఆదాయం. కాబట్టే ఈ రెండు జిల్లాల్లో రైతులు తమ భూములు కోల్పోవడానికి ఇష్టపడడం లేదు. ఈమేరకు ఈ రెండు జిల్లాల రైతులు మండలాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ భూసేకరణను వ్యతిరేకిస్తున్నారు. దీన్ని బట్టి చూస్తుంటే విజయవాడ ప్రాంతంలో రాజధానికి భూసేకరణ కష్టసాధ్యంగా మారే అవకాశముంది. ఒకవేళ బలవంతంగా భూసేకరణ జరపాలన్నా సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వ విలువకంటే నాలుగురెట్లు అదనంగా ఇవ్వాలి. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రభుత్వం వద్ద అంత సీన్ లేదు. కాబట్టి విజయవాడ ప్రాంతంలో రాజధాని కదలిక చాలా ఆలస్యమయ్యే అవకాశముంది. శివరామకృష్ణన్ కమిటీ సూచించిన దొనకొండ వంటి ప్రాంతంలో అయితే భూసేకరణ అసలు సమస్యే కాదు. ప్రైవేట్ వ్యక్తులు ధారాళంగా భూములిచ్చేవాళ్ళు. బయట ప్రాంతాల పెట్టుబడిదారులు కూడా వచ్చి ఇక్కడ భూములు కొనుగోలు చేసేవాళ్ళు. ఆర్థిక లావాదేవీలు పెరిగేవి. కాని ఇప్పుడు విజయవాడ ప్రాంతంలో ఎవరూ భూములు కొనడం లేదు. అమ్మకాలూ లేవు. దీంతో ఆర్థిక కార్యకలాపాల చక్రమే ముందుకు కదలడం లేదు.

## కార్పొరేషన్ మారేనా?

(మొదటిపేజీ తరువాయి)

నగరాభివృద్ధిపై పెట్టలేదు. అక్రమ నిర్మాణాలు కొందరు అధికారుల పాలిట వరంగా మారి లక్షలకొద్దీ లంచాలను ప్రసాదంగా స్వీకరించారు. కాసులకు అమ్ముడుపోయి న్యాయస్థానాలు తొలగించమని ఆదేశాలిచ్చిన నిర్మాణాలను సైతం వీరు తొలగించకుండా వదిలేశారు. నగరంలో అక్రమ కొళాయి కనెక్షన్లకు, అధికారుల అక్రమ కలెక్షన్లకు, నగరం నిండా అక్రమ కన్‌స్ట్రక్షన్లకు లెక్కేలేదు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతుంటే అవినీతి అధికారులకు పండుగే! నిబంధనల ప్రకారం ఎవరన్నా నిర్మాణాలు చేపట్టినా అధికారులే వారిని తప్పుదోవ పట్టించిన సందర్భాలున్నాయి. నెల్లూరంతా వెదికితే ప్లాన్ ప్రకారం కట్టిన నిర్మాణాలు 30శాతం కూడా ఉండవు. ముఖ్యంగా సిటీ ప్లానింగ్ విభాగంలో పని చేసేవారికి వారి పోస్టింగ్‌గే ఓ "వర"ంలా భావించి భవన నిర్మాతల వద్ద భారీగా "ప్రసాద"ం స్వీకరిస్తున్నారు. ఇక డ్రైనేజీ, మంచినీటి పైపులైన్లు, పారిశుద్ధ్య కార్యక్రమాలలో అవినీతిని కొలవడానికి కొలబద్ద చాలదు. కార్పొరేషన్‌కు ఇంతకాలం నాన్ ఐఏఎస్ అధికారులు వచ్చారు. పాలకవర్గాల చేతిలో వీళ్లు కీలు బొమ్మలుగా ఉంటూ వారితో పాటూ నాలుగు రూపాయలు సంపాదించుకుని వెళ్లారు.

నగరపాలకసంస్థ కమిషనర్‌గా ఒక మంచి ఐఏఎస్ అధికారి వస్తేగాని నెల్లూరు బాగుపడదనే అభిప్రాయం చాలారోజులుగా వుంది. ఎట్టకేలకు కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు పుణ్యమా అని ఐఏఎస్‌తో పాటు ఐపిఎస్ కూడా చేసివున్న చక్రధర్‌బాబు కమిషనర్‌గా వచ్చారు. నెల్లూరుకు ఇదొక మంచి శుభపరిణామం. ఈయనకు గట్టి అధికారిగా పేరుంది. రావడంతోనే కార్పొరేషన్‌లో సాంప్రదాయ బద్ధంగా జరుగుతున్న అక్రమాలపై దృష్టి సారించారు. ముఖ్యంగా విధులకు అప్పుడప్పుడూ మొక్కుబడిగా వచ్చే సిబ్బందిపై దృష్టి సారించారు. విధులలో అలక్ష్యం వహించే సిబ్బందికి మెమోలు జారీ అవుతున్నాయి. దీంతో సిబ్బందిలో వణుకు మొదలైంది. టైంకు సీట్లలో కూర్చుని పనులు చేస్తున్నారు. ఇంతకుముందు కమిషనర్లను పాలకవర్గాలు ఆడించేవి, ఇప్పుడు కమిషనర్ కనుసన్నల్లోనే కార్పొరేషన్ వ్యవహారాలన్నీ కొనసాగుతాయి. దాదాపు అవినీతి అక్రమాలకు కాలం చెల్లినట్లే! అని ప్రజలు భావిస్తున్నారు. నగరం నిండా ఆక్రమణలున్నాయి. మున్సిపల్ స్థలాలు, నీటి పారుదల నిల్వలు ఆక్రమణలకు గురై ఉన్నాయి. కొత్త కమిషనర్ వీటిపై దృష్టి సారించాలి.

నెల్లూరు నగరాన్ని అది చేస్తాం, ఇది చేస్తాం, నెల్లూరును సింగపూర్‌ను చేస్తామంటూ గతంలో అందరూ మాటలు చెప్పారు. కాని ఎవ్వరూ చేసి చూపించింది లేదు. కొత్తగా వచ్చిన కమిషనర్ చక్రధర్‌బాబు అయినా నెల్లూరు రూపురేఖలను మార్చే ప్రయత్నంలో ముందడుగు వేయాలని నెల్లూరు ప్రజల ఆకాంక్ష!

### నగరంలో 3వేల అక్రమ నిర్మాణాలను గుర్తించాం

**- సిటీ ప్లానర్ వరప్రసాద్**

నగరంలో ఇప్పటివరకు 3వేల అక్రమనిర్మాణాలను గుర్తించి కొత్త కమిషనర్ దృష్టికి తీసుకెళ్ళామని, త్వరలోనే వీటన్నిటిపైన చర్యలకు ఆయనే ఆదేశించాలని సిటీ ప్లానర్ వరప్రసాద్ 'లాయర్'కు చెప్పారు. ఈ 3వేల నిర్మాణాల పూర్తి వివరాలను కమిషనర్‌కి తాను అందజేసినట్లు చెప్పారు. 3వేల అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే మీ శాఖ ఏం చేస్తోంది...? అని 'లాయర్' ప్రశ్నించగా తానూ తనతో పాటు మరో ఇద్దరు సిబ్బంది మాత్రమే వున్నామని, ముగ్గురు వ్యక్తులతో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడం తమకు సాధ్యం కాదని చెప్పారు.

## ఆధిపత్యం దిశగా అడుగు

(మొదటిపేజీ తరువాయి)

అధికారం చేతిలో వుంది కాబట్టి అందరినీ తన దారికి తెచ్చుకునేందుకు దండించే మార్గంలో పోతున్నాడు. ఈ నేపథ్యంలో దూకుడు ప్రదర్శిస్తూ తన పార్టీ నాయకులు డాక్టర్ జడ్.యస్., మేయర్ అజీజ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు రవిచంద్రల మీద వేర్వేరు సందర్భాల్లో ఆగ్రహావేశాలు వ్యక్తం చేశాడు. ఇలా చేయడం వల్ల పార్టీ మీద కేడర్ మీద ఆధిపత్యం వస్తుందనుకుంటే పొరపాటు. పార్టీ అధికారంలోకి రాగానే కాంగ్రెస్, వైకాపాలో వున్న నాయకులను తెలుగుదేశంలో చేర్పించి మంత్రి తన వెంట తిప్పుకుంటున్నాడు. మంత్రి ఇలాకాలో వారిదే పెత్తనం అయ్యింది. ఎన్నో ఏళ్లుగా పార్టీ జెండాలు మోసిన వాళ్ళు దీనిని సహించలేకపోతున్నారు. మంత్రికి దగ్గరవుతామనుకున్నవాళ్లు కూడా కాలేకపోతున్నారు. చంద్రబాబు అయినా, ఇతర నేతలయినా నిలబడేది కార్యకర్తల భుజాలమీదే! మరి పార్టీకి విధేయులైన కార్యకర్తలనే పార్టీ వదిలి పొమ్మంటుంటే ఇక పార్టీపై ఆధిపత్యం ఎలా వస్తుంది?

# 'స్వచ్ఛ భారత్'తో నెల్లూరుకు నష్టం

గల్పిక

అది ఐఆర్20-420 మున్సిపల్ కార్పొరేషన్ ముదురుదోమలకు ప్రసిద్ధిగాంచిన నెల్లూరు నగరం. గాంధీబొమ్మ సెంటర్. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులు, ఆయా సంఘాల కార్యకర్తలు వేలాదిగా పోగయ్యారు. అందరి చేతుల్లోనూ చీపుర్లు, చెత్తబుట్టలున్నాయి. అప్పుడే అక్కడకు కేంద్రమంత్రి యం.వెంకయ్య నాయుడు, రాష్ట్రమంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, మేయర్ అబ్దుల్ అజీజ్, తెలుగుదేశం నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్, కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, ఎస్పీ సెంథిల్ కుమార్, జాయింట్‌కలెక్టర్ రేఖారాణి, కార్పొరేషన్ కమిషనర్ చక్రధర్ వంటి వారంతా చేరుకున్నారు. వేదికపైన ముఖ్యనేతల ప్రసంగాలు అయ్యాక వెంకయ్యనాయుడు మైకందుకుని, పదేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం పోసిన చెత్తను ఎత్తేయడానికే ఈ స్వచ్ఛభారత్ కార్యక్రమం పెట్టాం. రాష్ట్రంలో ఎలాగూ వర్షాలు లేవు, కరువు పరిస్థితులున్నాయి. జనాలకు పనీపాటా లేదు, కాబట్టి రోజుకు రెండుగంటలన్నా చెత్తను ఎత్తేపని పెట్టుకోండి, మీ పరిసరాలు బాగుంటాయి, మీకూ సోమరితనం అలవాటు కాకుండా ఉంటుందని ముగించాడు.

తర్వాత అందరూ చీపుర్లు చెత్త బుట్టలు పట్టుకుని అన్ని రోడ్లవైపుకు కదిలారు. చెత్తకుప్పల కోసం నాయకులు ఒకరికొకరు పోటీ పడసాగారు. కో-ఆపరేటివ్ బ్యాంకు ముందు ఒక మోస్తరు చెత్త కుప్ప ఉండింది. దూరం నుండే దానిని చూసిన రమేష్‌రెడ్డి... ఆ చెత్తకుప్ప నాది అని కేకేసి పరుగు పెట్టాడు. ఆ చెత్తకుప్పకు పక్కనే వున్న కిలారి వెంకటస్వామినాయుడు వెంటనే రియాక్టై... కాదు, ఆ కుప్ప నాది, ముందుగా నేను చూసి రాయి కూడా వేసాను అని పేచీకి దిగాడు. రమేష్‌రెడ్డి వెనక్కి తగ్గలేదు. దీంతో ఇద్దరు ఓ సినిమాలో బర్రెలు వేసే పేడ కోసం కోట శ్రీనివాసరావు, బాబుమోహన్ తన్నుకున్నట్లుగా చెత్తకుప్పను ఎత్తేయడానికి వాదులాటకు దిగారు. గలాటా మొదలు కావడంతో అందరూ దానిని వినోదంలా చూస్తూ గుంపుగా పోగయ్యారు. వెంటనే మంత్రి నారాయణ అక్కడకు చేరుకుని... ఇద్దరికీ సర్దిచెప్పి, ఈ చెత్తను మీరిద్దరూ కాదు, నేనే ఎత్తేస్తానని చెప్పి ఎత్తేసాడు. అప్పుడు రమేష్‌రెడ్డి, కిలారి మనసులో పిట్ట పోరు పిట్ట పోరు పిల్లి తీర్చడమంటే ఇదేనేమో అనుకున్నారు.

వెంకయ్యనాయుడు పంచె ఎగ్గట్టి ఒక చేత్తో నీళ్ల బకెట్, ఇంకో చేత్తో గుడ్డ పట్టుకుని గాంధీబొమ్మ మండపం ఎక్కాడు. నీళ్లలో గుడ్డను తడిపి గాంధీ విగ్రహం మీదున్న దుమ్మును తుడవసాగాడు. అంతలో వెంకయ్యా... అనే పిలుపు వినిపించింది. ఎవరబ్బా నన్ను పిలిచేది అని వెంకయ్య అటు ఇటు చూశాడు. ఎవరు నన్ను పేరు పెట్టి పిలిచింది అని వెంకయ్య గట్టిగా అరిచాడు. నేనేనయ్యా, బాపూజీని అని మళ్లీ పలకరింపు... వెంకయ్యకు ఆశ్చర్యమేసి గాంధీ విగ్రహం తలవైపు చూశాడు. ఆశ్చర్యం... అక్కడ మాట్లాడుతున్నది గాంధీమహాత్ముడే... వెంకయ్య నాయుడు ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాడు. మహాత్మా, నా క్లీనింగ్ ప్రోగ్రామ్‌కు మెచ్చి, నాకు దర్శనమిచ్చావా... ధన్యుడిని స్వామీ, ధన్యుడిని అన్నాడు. ఆ మాటకు గాంధీజీ... నీ క్లీనింగ్‌కు మెచ్చి కాదునాయనా, ఈ పాడు పని చెయ్యొద్దని చెప్పడానికే ప్రత్యక్షమయ్యాను. నువ్వు తీరిక దొరికిందని ఈరోజు శుభ్రంగా వుంచిపోతావు, అంతేగాని రోజూ వచ్చి చేయలేవుగా, రేపట్నుంచి యధావిధిగా దుమ్ము, ధూళిలో ఉండాల్సిందే కదా! ఎన్నో ఏళ్లుగా ఈ దుమ్ముకి అలవాటు పడిపోయాను. ఈరోజు శుభ్రం చేస్తారు. నాకు ఈరోజున్నట్లే ప్రతిరోజూ ఉండాలనిపిస్తుంది. కాని అది సాధ్యం కాదు కదా, రేపట్నుంచి నాకు మళ్లీ ఈ కంపు తప్పదు. అందుకే నన్ను ఇలాగే ఉండనీయమంటున్నానని చెప్పాడు. దానికి వెంకయ్య... ఈరోజు నేను చేస్తే, నన్ను చూసి రేపు ఇంకొకరు చేస్తారు. ఇలా ఒకరి నుండి తొమ్మిదిమంది స్ఫూర్తి పొందేలా మన ప్రధాని చైన్‌లింక్ స్కీం పెట్టారు. మీరేం వర్రీకాకండి, త్వరలోనే మీరు మార్పును చూస్తారని చెప్పి క్రిందకు దిగాడు. మనవాళ్లు క్లీనింగ్ కార్యక్రమం ఎలా చేస్తున్నారో చూద్దామని చెప్పి ముందు కాపువీధిలోకి పోయాడు. అక్కడచూస్తే మంత్రి నారాయణ చెమట్లు కక్కుతున్నాడు. చెత్తను ఎత్తడానికి, లారీలో వేయడానికి తీరికలేకుండా ఉంది. అది చూసి వెంకయ్య... ఏంటి నారాయణ, ఇంత చెత్త ఎక్కడిది అని అడిగాడు. ఏమో సార్, లారీలకు లారీలు చెత్తను ఎత్తి పంపిస్తూనే ఉన్నాను, కాని ఎంత ఎత్తినా ఊరుతూనే ఉందన్నాడు. వెంకయ్య వీధి కొసదాకా చూసాడు. నాలుగు లారీలకు సరిపడ్డ చెత్త అక్కడ వుంది. వెంకయ్య అక్కడనుండి నర్తకి సెంటర్ వద్దకు వెళ్లాడు. సోమిరెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఇంకొంత మంది కార్పొరేటర్లు చెత్తను ఎత్తలేక ఆపసోపాలు పడుతున్నారు. అయినా అక్కడ ఎప్పటికప్పుడు చెత్త పడుతూనే వుంది. అక్కడున్న చెత్తను చూసి వెంకయ్య కోపంగా... మీరు చెత్తను ఎత్తుతున్నారా లేక ఆడుకుంటున్నారా, ఎక్కడిచెత్త అక్కడే వుందేంటని అడిగాడు. దానికి సోమిరెడ్డి... ఏమో సార్, మేమైతే చెత్తను ఎత్తుతూనే వున్నాం. కాని మళ్లీ ఎవరో తెచ్చి పోస్తున్నట్లుగా చెత్త ఇక్కడే వుంటుందన్నాడు. వెంకయ్యకు ఆశ్చర్యమేసింది. అక్కడ నుండి సండేమార్కెట్ వద్ద కెళ్లాడు. మేయర్ అజీజ్, కలెక్టర్ శ్రీకాంత్, ఎస్పీ సెంథిల్‌కుమార్, జాయింట్‌కలెక్టర్ రేఖారాణి చెమట్లు కక్కుతున్నారు. అజీజ్ అయితే నీరసం వచ్చి అక్కడే మెట్లమీద కూర్చున్నాడు. వెంకయ్య ఆగ్రహంగా... ఏంటి మేయర్ గారు, చెత్తను ఎత్తకుండా తీరిగ్గా కూర్చున్నారని అడిగాడు. ఏం చేసేను వెంకయ్య సాబ్... ఎంత చెత్త ఎత్తినా మళ్లీ పుట్టుకొస్తూనేవుంది. ఎవరో చెత్తను అది పనిగా తెచ్చి పోస్తున్నట్లుగా వుందన్నాడు. వెంకయ్య ఆశ్చర్యంగా... ఇదేంటి, ఎక్కడ చూసినా ఇదే కంప్లైంట్ వినపడుతుందన్నాడు. వెంటనే పక్కనేవున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెంకయ్య చెవిలో ఏదో చెప్పాడు. వెంకయ్య వెంటనే సెల్‌ఫోన్ తీసి ఒక నెంబర్‌కు ఫోన్ చేశాడు. అవతల వ్యక్తి ఫోన్ ఎత్తగానే పది నిముషాలలో సండేమార్కెట్ వద్దకు రమ్మని చెప్పి పెట్టేశాడు.

కరెక్ట్‌గా పదినిముషాల తర్వాత నల్లటి 'ఆడి' కారు సండేమార్కెట్ వద్దకు వచ్చింది. అందులో నుండి స్టైల్ ఆఫ్ సింహపురి, మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి దిగాడు. వెంకయ్య వద్దకెళ్లి, ఎందుకన్నా పిలిచారని అడిగాడు. మా వాళ్లంతా చెత్తను ఎత్తుతుంటే, కొత్తగా చెత్తను పోస్తున్నది మీరేనా అని అడిగాడు. అవును అని వివేకా సమాధానమిచ్చాడు. అది విని అందరూ ఆశ్చర్యపోయారు. అలా ఎందుకు చేసావని వెంకయ్య ప్రశ్నించాడు. నెల్లూరు కోసమే... అని వివేకా చెప్పాడు. ఆ మాటకు అందరిలో ఆశ్చర్యం బి.పిలా పెరిగింది. నెల్లూరు కోసమా... ఎందుకు? అని నారాయణ ప్రశ్నించాడు. అప్పుడు వివేకా చెప్పడం మొదలుపెట్టాడు. నెల్లూరులో ఈ చెత్తదిబ్బలు, మురికిగుంటలు ఉండబట్టే మన నెల్లూరులో ఐఆర్ 20-420 మేలుజాతి ముదురుదోమలు ఉత్పత్తి అవుతున్నాయి. ఈ చెత్త దిబ్బలను నమ్ముకుని వేలాది పందులు, కుక్కలు బ్రతుకుతున్నాయి. మన దోమలకు ఈరోజు ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ వుంది. భవిష్యత్‌లో ఎర్రచందనం లాగా ఈ దోమలను విదేశాలకు ఎగుమతి చేసి కోట్లాదిరూపాయలు సంపాదించాలనుకుంటున్నాం. మీరంతా ఈరోజు ఉన్నట్లుండి చెత్తదిబ్బలు ఎత్తేస్తే, మురికి గుంటలు లేకుండా చేస్తే ఈ అరుదైన దోమలజాతి అంతరించిపోదా? ప్రపంచ దేశాలలో మన నెల్లూరుకు వున్న ప్రాధాన్యత తగ్గిపోదా? అందుకే మీరు ఎత్తేసిన చెత్తను నేనే మళ్లీ పోయించానని చెప్పాడు. అది విని అందరూ ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టారు.

కదంబం

## కొండపూలు

మంత్రి కృష్ణమోహన్
మార్కాపురం. 9441028186

ఊరి పొలిమేర దాటి
చుట్టూ, ఏ పల్లెకు దారితీసినా
తోవ పొడుగునా పచ్చపచ్చగా
ఆకుపచ్చదనం అంచుల మీద –
కొండొకచో
నారు పోసిన పంటలా వనంలా
ఇవి బాటసారి వెంట
నిండైన నవ్వుతో మెరుపుతో –

కోమల హరితవనాలు ఇష్టంగా దర్శిస్తాను
మొక్కమొక్కని పువ్వుపువ్వుని
ఆరాధనగా తిలకిస్తాను
కాని
సమీపించే ప్రతిసారి నను
స్నేహరాగమై పలుకరించేవి ఈ పూలే!
నిర్మల దృక్కులు
హాయిగా సారించేవి ఈ పూలే!
నిలువెల్లా కనకపరవశమై ఊగేవి
తూగేవి ఈ పూలే!

నీళ్ళు లేని నిస్సార నేల ప్రాంతమైనా
నిశ్చింతగా నిమ్మళంగా
బహుతృప్తిగా
తేజోపూరితంగా –

కొన్ని పసిడివన్నె కొండపూలు
బంజరుపూలు
ఈ తంగెడు పూలే!

## మహాత్మాగాంధీ 145వ జయంతి



మహాత్మాగాంధీ 145వ జయంతి సందర్భంగా అంతర్జాతీయ వైశ్య సమాఖ్య ఉపాధ్యక్షుడు కె.వి.చలమయ్య మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చలమయ్య మాట్లాడుతూ అహింస, శాంతి మార్గాలలో భారతదేశానికి స్వాతంత్ర్యం సంపాదించిన మహానుభావుడు గాంధీ ఆశయాలు నేటి తరానికి ఆదర్శనీయమన్నారు. గాంధీజీ కలలుకన్న పరిశుభ్రతను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్, బయ్యా ప్రసాద్, ఆర్‌వి సుబ్బారావు, కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటమి ఎరుగని ప్రజానాయకుడు కె.ఇ




కె.ఇ.కృష్ణమూర్తి బర్త్‌డే కేక్‌ను కట్ చేస్తున్న మంత్రి పి.నారాయణ, బీదా రవిచంద్ర తదితరులు

నెల్లూరు నగరంలోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కె.ఇ. కృష్ణమూర్తి జన్మదిన వేడుకలు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షులు జానా రామచంద్రయ్యగౌడ్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర పురపాలకశాఖా మంత్రి పొంగూరు నారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇప్పటివరకు ఓటమి ఎరుగని ప్రజా నాయకుడు కె.ఇ.కృష్ణమూర్తి అని కొనియాడారు. జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బీద రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో మరేపార్టీకి దక్కని ఘనత కె.ఇ.కృష్ణమూర్తి వంటి మచ్చలేని నాయకుడితో కలిసి పనిచేస్తున్న ప్రతి టిడిపి నాయకునికి, కార్యకర్తకు దక్కుతుందన్నారు. ట్రస్ట్ అధ్యక్షులు జానా రామచంద్రయ్యగౌడ్ మాట్లాడుతూ కె.ఇ.కృష్ణమూర్తి సేవాతత్పరణ ముందు ఎంత చెప్పినా తక్కువేనని, కె.ఇ జన్మదిన వేడుక సందర్భంగా పలు ప్రజాసేవా కార్యక్రమాలు ట్రస్టు ద్వారా నిర్వహించామన్నారు.

ఈ కార్యక్రమంలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మాజీశాసనసభ్యులు ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, టిడిపి రాష్ట్ర ప్రధానకార్యదర్శి తాళ్ళపాక అనూరాధ, జిల్లా మహిళా అధ్యక్షురాలు అంచల వాణి, నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రూరల్ ఇన్‌ఛార్జ్ కిలారి వెంకటస్వామినాయుడు, తాళ్ళపాక రమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## జాతిపిత ప్రపంచానికే మార్గదర్శి



సత్కారాన్నందుకుంటున్న తిరుమలశెట్టి చంద్ర

జాతిపిత మహాత్మాగాంధీ ప్రపంచానికే మార్గదర్శి అని ఏపి కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు బి.భవాని నాగేంద్రప్రసాద్ పేర్కొన్నారు. సృజన సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ హింసాత్మక ధోరణుల నివారణకు గాంధీజీ బోధనలే మార్గదర్శకమన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఎన్.వి.పద్మజ, సామ్రాట్ క్లినిక్ అధినేతలు డా॥ మారం సుధాకర్, డా॥ యం.విజయలక్ష్మి తదితరులు అతిథులుగా పాల్గొని చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సామాజిక, సృజనాత్మక చిత్రకారుడు తిరుమలశెట్టి చంద్రను ముఖ్యఅతిథులు, సంస్థ అధ్యక్షులు దగ్గుపాటి రాధాకృష్ణ సత్కరించారు. ఈ కార్యక్రమంలో సూక్ష్మ చిత్రకళాకారుడు ముసవ్వీర్, శేషమ్మ, సర్వేపల్లి రామమూర్తి, డి.విజయశేఖర్‌రెడ్డి, ఎల్.శంకరశర్మ, పి.సుందరరామిరెడ్డి, అళహరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఛానెల్స్‌నే టార్గెట్ చేయడం వెనుక...



తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంత మూర్ఖంగా ఉంటాడనేదానికి నిదర్శనం తెలంగాణలో టీవి9, ఏబిఎన్ ఛానెల్స్ నిషేధమే. మీడియాతో ఇంత వరకు ఏ ముఖ్యమంత్రి కూడా ఈ స్థాయిలో పేచీ పెట్టుకోలేదు. ఆంధ్ర ప్రదేశ్‌లో సాక్షి ఛానెల్, సాక్షి పత్రిక అంటే చంద్రబాబుకు పడకపోయినా తన సమావేశాలకు ఆ మీడియా వారిని ఆహ్వానించడం లేదు గాని పూర్తిగా నిషేధించలేదు. కాని తెలంగాణలో ఆ రెండు ఛానెల్స్ పరిస్థితి అది కాదు. పూర్తిగా ప్రసారాలు నిలిపి వేయించాడు కేసీఆర్. ఎంఎస్‌ఓల ద్వారా ఈ పని చేయించాడు. కేంద్రప్రభుత్వం జోక్యం చేసుకున్నా కూడా కేసీఆర్ ఏ మాత్రం తగ్గలేదు. ఎంఎస్‌ఓలు నిషేధం విధిస్తే ప్రభుత్వం ఏం చేస్తుందని వ్యంగ్యంగా చెప్పాడు.

తెలంగాణలో తెలుగుదేశంపార్టీకి అనుకూల ఛానెల్స్ లేకుండా చేయాలన్న లక్ష్యంలో భాగంగానే కేసీఆర్ మొదట ఈ రెండు ఛానెల్స్‌ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి చంద్రబాబుకు మొదట అనుకూలంగా ఉండే మీడియా ఈనాడు, ఈటీవీ. అయితే రాష్ట్ర విభజనలో రామోజీరావు తెలివిగా వ్యవహరించారు. తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలంగాణలో ఈటివి, ఈనాడు పత్రికల బాణీ మారిపోయింది. ఆంధ్రప్రదేశ్‌కు తెలంగాణకు ప్రత్యేక ఛానెల్స్, పత్రికలో ప్రత్యేక పేజీలు ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు పాలనను ఆకాశానికెత్తే ఈటీవి, ఈనాడు పత్రికలు తెలంగాణలోకి వెళ్లేసరికి కేసీఆర్‌కు బాకా ఊదసాగాయి. రామోజీరావుకు తెలంగాణలో చంద్రబాబు అవసరం ఇక పెద్దగా ఉండదనిపించింది. దాంతో అక్కడ మాత్రం కేసీఆర్‌కు సరెండరై ఆయన ఆగ్రహానికి గురికాకుండా కాపాడుకోగలిగాడు. ఈనాడు దారిలోకి వచ్చింది కాబట్టి తెలంగాణలో టీవి9, ఏబిఎన్ ఛానెల్స్‌ను లేకుండా చేస్తే ఇక తెలుగుదేశంకు ప్రచారం ఉండదని కేసీఆర్ భావించారు. తనకు రాజకీయ జన్మనిచ్చిన తెలుగుదేశంను తెలంగాణలో భూస్థాపితం చేయడానికి కంకణం కట్టుకున్న కేసీఆర్ ఇప్పటికే ఆ పార్టీలో వున్న లీడర్స్‌ను, కేడర్‌ను దాదాపు 80శాతం వరకు లాగేశాడు. తాజాగా తెలుగుదేశం నుండి నలుగురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ టీఆర్ఎస్‌లో చేరడానికి సమాయత్తమయ్యారు. కేసీఆర్ దూకుడు చూస్తుంటే తెలంగాణలో ఇక తెలుగుదేశం పార్టీ బ్రతికి బట్టకట్టడం కష్టమనిపిస్తుంది. ఓవైపు టీడీపీ కేడర్‌ను లాక్కుంటూ, ఇంకో వైపు ఆ పార్టీ అనుకూల మీడియాను తెలంగాణ నుండి పూర్తిగా వెళ్లగొట్టడం ద్వారా తెలంగాణలో తనకు తిరుగులేకుండా చేసుకోవాలనేది కేసీఆర్ ప్లాన్.

# మాట తప్పని మహానేత.. డా॥ వై.యస్

• డాలస్‌లో తెలుగుప్రముఖుల ప్రశంస • వేడుకగా విజయదశమి • ఆకట్టుకున్న వైవి ప్రసంగం




సమావేశంలో వై.వి.సుబ్బారెడ్డిని టెక్సాస్ కౌబాయ్ హ్యాట్‌తో సత్కరించిన అనంతరం ప్రసంగిస్తున్న డా॥ కోర్సపాటి శ్రీధర్‌రెడ్డి

ప్రజల సంక్షేమమే పరమావధిగా పనిచేసిన నేత, మాట తప్పని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని, ప్రజల అభ్యున్నతి కోసం ఆయన ఎన్నో పథకాలు చేపట్టి అమలుచేశారని, అలాంటి నేతకు సాటి ఎవరూ లేరని అమెరికాలోని డాలస్‌లో పెద్దఎత్తున జరిగిన తెలుగువారి సమావేశంలో పాల్గొన్న పలువురు ప్రముఖులు ప్రశంసించారు. విజయదశమి పర్వదినం సందర్భంగా డాలస్‌లోని రుచి ప్యాలెస్‌లో దాదాపు 250 మంది తెలుగు ప్రముఖులు సమావేశమై, ఆనందోత్సాహాలతో విజయదశమి వేడుకలు జరుపుకున్నారు. వైఎస్సార్‌సీపి నేత, ఒంగోలు ఎంపి వైవి సుబ్బారెడ్డి ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రపంచంలో తెలుగువారు ఎక్కడున్నా వారి సంక్షేమమే తమ ధ్యేయమని ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి అందరి హర్షధ్వానాల మధ్య అన్నారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న తెలుగు ప్రజలంతా కలసి, ఎల్లలెరుగని స్నేహ సౌహార్ధభావాలతో, ఆనందసందోహాలతో ఈ వేడుకలో పాల్గొనడం ఎంతో సంతోషకరమన్నారు.

డాలస్‌లోని తెలుగుప్రముఖులు సుబ్బారావు, నార్త్ టెక్సాస్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు విజయమోహన్ కాకర్ల, రమణారెడ్డి కృష్ణపాటి, డాక్టర్ పవన్ పాములదుర్తి, ప్రమోద్‌రెడ్డి, మహేష్ ఆదిభట్ల, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, కె.సి చెరుకూరి, అజయ్‌రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపి నేత, ఒంగోలు ఎంపి వైవి సుబ్బారెడ్డి ప్రపంచం నలుమూలలా వున్న తెలుగువారిని ఉద్దేశించి ప్రసంగిస్తూ, అందరికీ విజయదశమి, బతుకమ్మ పండుగల శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావంతో, సౌహార్ధ హృదయంతో తెలుగు ప్రజలంతా శాంతి సౌఖ్యాలతో జీవించాలని ఆయన ఆకాంక్షించారు. ఇరు రాష్ట్రాల తెలుగు ప్రజలు ప్రగతిపథంలో పయనించాలన్నారు. రెండు రాష్ట్రాల ప్రజల సంక్షేమాన్ని వైఎస్సార్‌సీపి కోరుకుంటోందని అన్నారు. దివంగత మహానేత డాక్టర్ వైఎస్ బాటలో నడుస్తూ, ఆయన ఆశయాలను సాధించే సత్తా ఒక్క వైఎస్ జగన్మోహన్ రెడ్డికే వుందన్నారు. తొలుత, ఎంపి వైవి సుబ్బారెడ్డి డల్లాస్‌కు విచ్చేసిన సందర్భంగా డాక్టర్ శ్రీధర్ కొర్సపాటి ఆయనకు టెక్సాస్ కౌబాయ్ హ్యాట్‌ను గౌరవపూర్వకంగా బహూకరించారు. ఎంతో ఉత్సాహంగా జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతాప్ భీమ్‌రెడ్డి, మధు మల్లు, శ్రీనివాస్ భవిరెడ్డి, ఎ.శ్రీనివాస్, కె.సుబ్బారావు, మహేందర్ కామిరెడ్డి, జి.రాజ్, జయచంద్రారెడ్డి, రమణ పొట్లూరి, జానకిరాం మందాడి, రఘువీర్ బండారు, వెంకట్ నార్వల, యు.నర్సింహారెడ్డి, సుబ్బు జొన్నలగడ్డ, కృష్ణ ఉప్పలపాటి, సిహెచ్ బల్కి, రాజారెడ్డి, భాస్కరరెడ్డి, నారాయణరెడ్డి, విష్ణు బత్తుల, డి. సాంబ, లోకేష్‌నాయుడు, సతీష్ బండారు, సతీష్ బొమ్మినేని, రవి కోన, ఉమా మహేష్, కె.ఉమ, సుధాకరరెడ్డి, సుబ్బు దామిరెడ్డి, డాక్టర్ రామిరెడ్డి బుచ్చిపూడి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2002లో ప్రతిపక్షనేతగా వున్నప్పుడు డాక్టర్ వైఎస్ డల్లాస్ పర్యటనను వారు జ్ఞప్తికి చేసుకున్నారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# 16న నింగిలోకి పిఎస్ఎల్‌వి-సి26



ఇస్రో ప్రయోగాలకు తురుపుముక్క పిఎస్ఎల్‌వి సిరీస్‌లో మరో ప్రయోగానికి శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం సిద్ధమైంది.

ఈ నెల 16వ తేదీ తెల్లవారుజామున 1.32గంటలకు పిఎస్ఎల్‌వి-సి26ను ప్రయోగించనున్నారు. వాస్తవానికి ఈ నెల 10నే ఈ ప్రయోగం జరగాల్సి ఉండగా రాకెట్ నాలుగో దశలోని ఉపకరణాలలో సాంకేతిక లోపం సంభవించింది. దాంతో ప్రయోగాన్ని వాయిదా వేశారు. నాలుగోదశలో వున్న హీట్‌షీల్డ్‌ను తొలగించి దాని స్థానంలో కొత్త పరికరాలు ఏర్పాటు చేశారు. ఈ రాకెట్ ద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్-1సి ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. 13వ తేదీ ఉదయం 6.32గంటలకు ఈ రాకెట్ ప్రయోగానికి సంబంధించి కౌంట్‌డౌన్ మొదలుకానుంది.

# రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో రత్నం విద్యార్థిని



కర్నూలు ఇండోర్ స్టేడియంలో ఈ నెల 4 నుండి6వ తేదీ వరకు జరిగిన 39వ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో డా॥ కిషోర్ రత్నం స్కూలు(ఒలింపియాడ్ బ్యాచ్) విద్యార్థిని పాల్గొని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. అండర్ 14 నుండి 17 యోగాసనాల విభాగంలో నెల్లూరు సరస్వతినగర్‌లోని రత్నం హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని కె.జోషిత 2వస్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకుని జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా డైరెక్టర్స్ డా॥కె.కృష్ణకిషోర్, వాసంతి కృష్ణకిషోర్‌లు మాట్లాడుతూ నేటి పోటీ యుగంలో రత్నం స్కూల్ విద్యార్థులు చదువుతో పాటు అన్ని విభాగాల్లో పాల్గొంటూ తమ ప్రతిభ జాతీయ అంతర్జాతీయ స్థాయికి చాటారన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ రామ్మూర్తి నాయుడు, ప్రిన్సిపల్ కెవిడి మనోజ్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.






Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com